ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 83 ఆదివారం 08 - 03 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 83 Sunday 08 - 03 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## మహిళలకు అత్యంత సురక్షిత రాష్ట్రం తెలంగాణ

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జేఎన్టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం
- పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి
- మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడి
- మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకువచ్చామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు
- కార్యక్రమంలో సినీ నటుడు సాయి దుర్గ తేజ్, మహిళా ఉన్నతాధికారులు
- మహిళలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అమ్మే అవకాశం కల్పించామన్న సీఎం రేవంత్ రెడ్డి
- ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు
- తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు




**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 07 :**
మహిళల ప్రాధాన్యం గుర్తించి కాంగ్రెస్ పార్టీలో పదవులు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్న సీఎం మనల్ని మనం సవరించుకోవాలని అన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయన్న సీఎం వాటిని కట్టడి చేయాలని పిలుపునిచ్చారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, సినీ నటుడు సాయి దుర్గ తేజ్, మహిళా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకువచ్చామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. - మిగతా 2 లో


2 లో

### ముగిసిన ఫిరాయింపు
## ఎమ్మెల్యేలపై విచారణ

- కడియం, దానం కేసుల్లో తీర్పు రిజర్వ్
- సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ ముగించిన స్పీకర్
- 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్
- కడియం, దానం భవితవ్యంపై ఉత్కంఠ

### గణపతి లొంగిపోతే
## రక్షణ కల్పిస్తాం



- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రేవంత్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన 130 మంది మావోయిస్టులు
- లొంగిపోయిన మావోయిస్టు పార్టీలోని కంప్యూటర్, సిగ్నల్ ఆపరేటర్లు
- 124 తుపాకులను పోలీసులకు అప్పగించిన లొంగిపోయిన మావోయిస్టులు
- లొంగిపోయిన వారిలో 125 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు
- తెలంగాణకు చెందిన నలుగురు లొంగుబాటు

**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 07 :**
మావోయిస్టు లొంగుబాటుకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు - మిగతా 2 లో

## అమ్మాయి పెళ్లికి తులం బంగారం, సిల్క్ చీర

- ప్రతి మహిళకు రూ.2,500 ఆర్థిక సాయం
- మహిళపై టీవీకే విజయ్ వరాల జల్లు
- మహిళల కోసం ఎన్నో హామీలు ఇచ్చిన టీవీకే చీఫ్ విజయ్
- నవజాత శిశువుకు బంగారు ఉంగరం ఇస్తామని హామీ
- ప్రభుత్వ ఉద్యోగులు మినహా, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రూ.15 వేల ఆర్థిక సాయం
- ఏటా 6 గ్యాస్ సిలిండర్లు



**వార్త సంధ్య, తమిళనాడు , మార్చి 07 :**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ హామీల వర్షం కురిపించారు. మహిళల కోసం అనేక వాగ్దానాలు చేశారు. తమిళనాడులో తాము అధికారంలోకి వస్తే నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, యువతులకు పెళ్లి కోసం తులం బంగారం, పట్టుచీర, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి ఆరు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీల వర్షం కురిపించారు. నవజాత శిశువులకు బంగారు ఉంగరం ఇస్తామని - మిగతా 2 లో

## యువత ఇకనైన మారండి


2 లో

- అంతిమయాత్రలో కాజీపేట ఏసీపీ భావోద్వేగ ప్రసంగం
- మద్యం మత్తులో యువకుడి మృతి..
- అంతిమయాత్రలో ఏసీపీ ప్రసంగం
- శవాన్ని చూసైనా మారండి అంటూ యువతకు హితబోధ
- తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలంటూ ఏసీపీ భావోద్వేగం
- చెడు స్నేహాలు వదులుకోవాలని, జీవితం విలువ తెలుసుకోవాలని సూచన


2 లో

### ఇక మీపై దాడులు చేయబోం,
## క్షమించండి

- గల్ఫ్ దేశాలకు సారీ చెప్పిన ఇరాన్ ప్రెసిడెంట్
- ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
- ఇప్పటి వరకు చేసిన దాడికి 'సారీ' అన్న పెజెష్కియాన్
- గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు
- పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ప్రతిదాడి చేస్తామని హెచ్చరిక


2 లో

## మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- ఏపీ మంత్రి నారా లోకేశ్
- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్

### చంద్రబాబు పాపులేషన్ పాలసీపై
## షర్మిల సెటైర్



- చంద్రబాబు జనాభా విధానంపై వైఎస్ షర్మిల వ్యంగ్యం
- ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న
- నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన
- రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు

**వార్త సంధ్య, అమరావతి, మార్చి 07 :**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న - మిగతా 2 లో

## సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉంది
- భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో 'రైసినా డైలాగ్' సదస్సు
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం
- ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు
- 'సాంకేతికత-సుపరిపాలన' భవిష్యత్తు అంశాలపై చంద్రబాబు కీలక ఉపన్యాసం
- భవిష్యత్తులో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే ఉందన్న సీఎం చంద్రబాబు
- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోందన్న సీఎం చంద్రబాబు అన్నారు




**వార్త సంధ్య, అమరావతి, మార్చి 07 :**
సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైసినా డైలాగ్-2026' సదస్సులో ఆయన పాల్గొన్నారు. 'సాంకేతికత-సుపరిపాలన' భవిష్యత్తు అంశాలపై చంద్రబాబు కీలక ఉపన్యాసం చేశారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ అనేక విషయాల్లో కేంద్రంతో కలిసి ముందుకెళ్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే ఉందని సీఎం అన్నారు. భవిష్యత్తులో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తాం: ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ - మిగతా 2 లో

# సంపాదకీయం

## సేద్యం.. సమరం.. మహిళ!



అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరం నడుస్తున్న వేళ భారత్ స్థూల దేశియోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా గత అంచనాల కంటే ఎక్కువగా ఉన్నట్టు కొత్త జీడీపీ గణాంకాలు వెల్లడించాయి. అత్యధికులకు ఉపాధి కల్పిస్తున్న సేద్య రంగ ఆధునికీకరణ విషయమై మరింత నిబద్ధత చూపేందుకు అది ప్రేరణ కావాలి. పశ్చిమాసియాలో జ్వలిస్తున్న యుద్ధాగ్నులు మన ఆర్థిక వ్యవస్థను మరీ ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని కుదిపివేసే ప్రమాదమున్నదన్న కఠోర వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. ఒక దేశ ఆర్థిక కార్యకలాపాల విలువను మదింపు వేసేందుకు ప్రపంచ వ్యాప్తంగా అంగీకృతమైన ప్రమాణమే స్థూల దేశియోత్పత్తి (జీడీపీ). స్వాతంత్ర్యానంతరం తొలి దశాబ్దాలలో మన స్థూల దేశియోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా 50శాతం కంటే ఎక్కువగా ఉండేది. పారిశ్రామికాభివృద్ధి, సేవల రంగం పురోగతి కారణంగా ఆ వాటా క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఇది ఆరోగ్యకరమైన పరిణామమే. అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో వ్యవసాయరంగ వాటా తక్కువగా ఉంటుంది. అమెరికా జీడీపీలో వ్యవసాయం వాటా 0.8 నుంచి 0.9శాతం మాత్రమే కాగా చైనాలో అది 6.7 నుంచి 7 శాతంగా ఉన్నది. మన జీడీపీలో సేద్య రంగం వాటా ప్రస్తుతం 16 నుంచి 18శాతంగా ఉన్నది. కానీ దీనిపై ఆధారపడే జనాభా 40 శాతం వరకూ ఉంది. అందుకే ఆ రంగంలో దరిద్రాల శాతం ఎక్కువగా ఉంది. అది తగ్గాలంటే ఉపాధి కల్పనకు కల్పతరువుగా వ్యవసాయాన్ని అధునాతన రంగంగా రూపొందించుకోవడంపై దృష్టి పెట్టాలి. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను, నవీన వ్యవసాయ వ్యాపార సామర్థ్యంతో మిళితం చేయాలి. తద్వారా ఆహార ఉత్పత్తిదారులు అయిన రైతుల శ్రేయస్సు, వినియోగదారుల ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధ్యమవుతుంది. వ్యవసాయ ఆధారిత సమాజాలలో అసమానతలను రూపుమాపేందుకు జీవనాధార వ్యవసాయాన్ని వాణిజ్య వ్యవసాయంగా సత్వరమే పరివర్తన చెందించవలసిన అవసరమున్నది. వ్యవసాయరంగంలోని మహిళల స్థితిగతులను పరిశీలిస్తే ఆ అసమానతలు ఎంతగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆ అసమానతల నిర్మూలన విషయమై ప్రపంచ ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 2026ను అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆహారోత్పత్తిలో పాల్గొంటున్న వారిలో 60 నుంచి 80శాతం దాకా మహిళలే కావడం విశేషం. అయితే భూ యాజమాన్యం, ఆదాయాలలో స్త్రీ పురుషుల మధ్య తీవ్ర అంతరాలు ఉన్నాయి. మన దేశంలోనూ ఇదే పరిస్థితి ఉన్నది. ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటున్న భారతీయ మహిళల్లో 80శాతం మంది వ్యవసాయరంగంలోనే ఉన్నారు. అయితే చిన్నవో పెద్దవో సొంత భూకమతాలు ఉన్నవారు కేవలం 8 నుంచి 14శాతం మంది మాత్రమే. వ్యవసాయరంగంలోని మహిళల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు రూపొందించి అమలుపరుస్తున్నప్పటికీ అసమానతలు ఎంతకూ తగ్గిపోవడం లేదు. పురుషుల కంటే ఎక్కువగా శ్రమిస్తున్న మహిళా రైతులు, రైతు కూలీలకు న్యాయం జరగడమే లేదు. వీటికి తోడు వాతావరణ మార్పు విషమ ప్రభావాలు వ్యవసాయరంగంలోని మహిళలను బాగా కుంగదీస్తున్నాయి. ఆర్థిక నష్టాలకు మరింతగా గురవుతున్నారు. తమ జీవనోపాధికి మరో గత్యంతరం లేకనే ఈ అసంఖ్యాక శ్రామికులు వ్యవసాయరంగంలో కొనసాగుతున్నప్పటికీ ఆహారోత్పత్తిలో వారి దీక్షాదక్షతలు ఎనలేనివని అనడంలో సందేహం లేదు. ఈ వాస్తవాన్ని గుర్తించి వ్యవసాయరంగ మహిళలకు న్యాయం చేయడం సమాజాల, ప్రభుత్వాల నైతిక కర్తవ్యం. ఒక పక్క వాతావరణ మార్పుతో పర్యావరణ వ్యవస్థలు ఛిద్రమవుతుండగా మరో పక్క యుద్ధాలు విరుచుకుపడుతున్న తరుణమిది. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాఇజ్రాయెల్ దాడులు, తత్ఫలితంగా పశ్చిమాసియా అంతటా వ్యాపిస్తున్న యుద్ధ జ్వాలలు మన ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంపై ప్రతికూల ప్రభావాలను చూపనున్నాయి. వీటిలో ముఖ్యమైనది ఎరువుల కొరత. భారత వ్యవసాయరంగానికి కీలకమైనవి యూరియా, అమ్మోనియా. వీటి ప్రధాన ఉత్పత్తిదారు ఇరాన్. ప్రస్తుత పరిస్థితులలో ఆ దేశం నుంచి ఈ ఎరువుల దిగుమతికి ఏర్పడే అంతరాయం సత్వరమే తొలగిపోకపోవచ్చు. ఫలితంగా సాగు వ్యయాలు పెరిగిపోయి, లాభాలు తగ్గుతాయి. రైతుల సంక్షేమం సంక్షోభంలో పడుతుంది. కొత్త జీడీపీ గణాంకాల ఆశాభావం పశ్చిమాసియా యుద్ధాగ్నుల తాకిడికి చెదిరిపోవడం ఖాయం. ఈ విషమ పరిస్థితుల్లో ఆహార ఉత్పత్తిదారుల శ్రేయస్సుకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి తీరాలి.

## మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

**మొదటిపేజీ తరువాయి -** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు. మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

**మొదటిపేజీ తరువాయి -** యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. "చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

## ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం క్లైమాక్స్ కు చేరుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పక్షాన చేరిన పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈరోజు తుది విచారణ ముగించారు. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగుస్తుండటంతో స్పీకర్ తీసుకున్న నిర్ణయం కీలకంగా మారింది. ఇందులో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్, వారిపై ఉన్న పిటిషన్లను కొట్టివేశారు. అయితే, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసుల్లో మాత్రం తీర్పును రిజర్వ్ చేశారు. వీరిద్దరి భవితవ్యంపై స్పీకర్ ఏ క్షణమైనా తుది తీర్పు వెలువరించే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.ధ

## అమ్మాయి పెళ్లికి తులం బంగారం, సిల్క్ చీర

**మొదటిపేజీ తరువాయి -** విజయ్ తెలిపారు. మహిళలకు అన్ని రకాల ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు మినహా, 60 సంవత్సరాల వయస్సు వరకు మహిళలందరికీ నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామని విజయ్ వెల్లడించారు. అన్నపూరణి సూపర్ సిక్స్ పథకం కింద ఈ ఆరు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని అన్నారు. కామరాజర్ కల్వి ఉరుతి తిట్టం పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సంవత్సరానికి రూ.15,000 అందిస్తామని అన్నారు. మామల్లపురంలో టీవీకే ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విజయ్ ఈ హామీలు ఇచ్చారు.

# సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి

**మొదటిపేజీ తరువాయి -** తెలిసిందేని ఆయన వ్యాఖ్యానించారు. అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోందన్న సీఎం చంద్రబాబు, మన దేశం భవిష్యత్తులో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుందన్నారు. డిప్లొమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుందని తెలిపారు. అమరావతిలో క్రియేటివ్ సిటీ: విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారని, ప్రపంచ అత్యుత్తమ కంపెనీల్లో పనిచేసే వారిలోనూ మన వాళ్లే ఎక్కువగా ఉన్నారని సీఎం అన్నారు. విభిన్నంగా ఆలోచించే వారి కోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీలో డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ నిర్మిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఆరోగ్యరంగంలో పెనుమార్పులు వస్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలో




డ్రోన్ అంబులెన్స్‌లు కూడా వస్తున్నాయని వివరించారు.'3 దశాబ్దాల క్రితమే ఐటీ విస్తరణ గురించి చెప్పాను. 1995లో సీఎం అయ్యాక ఐటీ రంగానికి ప్రాధాన్యత ఇచ్చాను. హైటెక్ సిటీని, సైబరాబాద్‌ను అభివృద్ధి చేశా. ఇప్పుడు నేడు అమరావతిలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. పెట్టుబడులతో వచ్చేవారికి జాప్యం లేకుండా అనుమతి ఇస్తున్నాం. పాపులేషన్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం: ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుందని దీనికోసం, పాపులేషన్ మేనేజ్‌మెంట్ చాలా కీలకమని సూచించారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5 శాతమే ఉందని, 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పిన వాళ్లే ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉండాలని చెబుతున్నామని వివరించారు. ఇద్దరి కంటే ఎక్కువమంది ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తామని సీఎం పునరుద్ఘాటించారు.

# మహిళలకు అత్యంత సురక్షిత రాష్ట్రం తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి -** ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులని, తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వానికి మహిళలపై సంపూర్ణమైన విశ్వాసం ఉందని అన్నారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని, సమాజంలో మహిళలకు ఇబ్బందులు పెరిగిపోతున్నాయని, మహిళలను వేధించడానికి టెక్నాలజీ వాడుతున్నారని తెలిపారు.

**మహిళల పేరు మీద రేషన్ కార్డులు ఇచ్చాం :** మన కుటుంబ సభ్యులపై జరిగే వేధింపులను ఎలా భావిస్తామో, ఇతర మహిళల విషయంలో కూడా అదే విధంగా స్పందించాలని సీఎం కోరారు. కాలేజీలు, కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సినిమా హాళ్లు వంటి ప్రదేశాల్లో మహిళల భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని, మహిళలపై వేధింపులు జరిగితే నిర్లక్ష్యం చేయడం కూడా ఒక రకంగా నేరమే అని పేర్కొన్నారు. మహిళల పేరు మీద రేషన్ కార్డులు ఇచ్చామని, ఇళ్ల కేటాయింపులు మహిళల పేరుతో వస్తున్నాయని అన్నారు. లక్షలాది మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌లో అమ్మే అవకాశం కల్పించామని వెల్లడించారు.

**తెలంగాణను మహిళలకు అత్యంత సురక్షిత రాష్ట్రం :** హైటెక్ సిటీలో మహిళలకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశామని, మహిళలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అమ్మే అవకాశం కల్పించామని సీఎం తెలిపారు. తెలంగాణలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, పెట్రోల్ బంకులను మహిళాలను నిర్వహించే అవకాశాలు తీసుకవచ్చామని గుర్తు చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రాష్ట్రానికి మహిళా యూనివర్సిటీ తీసుకువచ్చామని తెలిపారు. జిల్లాల్లో మహిళా కలెక్టర్లు, ప్రభుత్వంలో ముఖ్య పదవుల్లో మహిళలకు ప్రధాన పాత్రను కల్పించామని, తెలంగాణను మహిళలకు అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిద్దామమని అన్నారు. మహిళలు చదువుకొని, ఉద్యోగాలు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వివరించారు. "మహిళల ప్రాధాన్యం గుర్తించి కాంగ్రెస్ పార్టీలో పదవులు ఇస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టింది. మనల్ని మనం సవరించుకోవాలి.




మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయి. మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వానికి మహిళలపై సంపూర్ణమైన విశ్వాసం ఉంది. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది.

# గణపతి లొంగిపోతే రక్షణ కల్పిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** ఆయుధాలతో లొంగిపోయారు. మావోయిస్టులు 124 ఆయుధాలను అప్పగించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. 130 మందిలో 125 మంది ఛత్తీస్‌గఢ్, 4 తెలంగాణ, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు ఒక INSAS LMG రైఫిల్, (31) AK`47 రైఫిళ్లు, (21) INSAS రైఫిళ్లు, (20) SLR రైఫిళ్లు, (18) 303 రైఫిళ్లు, 33 ఇతర తుపాకులను పోలీసులకు అప్పగించారు. డీజీపీ శివధర్ రెడ్డి, డీఐజీ సుమతిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

**మంచి జీవితం గడిపేలా కృషి :** భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయేలా పోలీసులు కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పోలీసులు నక్సలైట్లలో ఒక నమ్మకాన్ని కల్పించారని, లొంగిపోయిన వాళ్లు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అహింసా పద్ధతిలోనే బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న చరిత్ర మనదని, హింస, ఆయుధాలతో పోరాటం ఒక్కటే పరిష్కారం కాదని గాంధీ చాటి చెప్పారని అన్నారు. అణ్వాయుధాలు ఉన్న దేశాలు కూడా ఇవాళ చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటున్నాయని, ఇంకా అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నానని, ప్రజలతో మమేకమై కలిసి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు.

**అమిత్ షా సూచించారు :** దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారన్న సీఎం తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారుని గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగింది చేస్తామని నక్సలైట్ నేతలతో చెప్పానని, నక్సలైట్ నేతల డిమాండ్లను కేంద్రహోం మంత్రితో చర్చించానని, లొంగిపోయిన వారి మెరుగైన జీవితానికి హామీ ఇవ్వాలని అమిత్ షా సూచించారని అన్నారు. అమిత్ షాతో చర్చల తర్వాత నక్సలైట్ నేతలతో మళ్లీ చర్చించానని, కేంద్రహోంమంత్రితో చర్చల సందేశాన్ని నక్సలైట్ నేతలకు వివరించానని, తమ చర్చల అనంతరం ఒకేసారి 130 మంది మావోయిస్టులు



లొంగిపోయారని అన్నారు. ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఏ రాష్ట్రంలోనూ లొంగిపోలేదని, ఇప్పటివరకు తెలంగాణలో 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు.

**హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం :** లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీతో పాటు ఆరోగ్య భద్రత కార్డు కల్పిస్తామన్న రేవంత్ రెడ్డి నిమ్స్ వంటి ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు పొందే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తామని చెప్తున్నామని, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో భూమి లభ్యత కష్టంగా ఉన్నందున భూమి ఇవ్వటంపై హామీ ఇవ్వలేనని, రాష్ట్రంలో హింసకు తావులేదని, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉంటే సహించేది లేదని పేర్కొన్నారు.

# ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

**మొదటిపేజీ తరువాయి -** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరఫున, ఇరాన్ ప్రజల తరఫున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.



# యువత ఇకనైన మారండి



**మొదటిపేజీ తరువాయి -** హనుమకొండ జిల్లాలో ఓ పోలీసు ఉన్నతాధికారి చేసిన ప్రసంగం ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఖాకీ దుస్తుల్లో కఠినంగా కనిపించే పోలీస్ అధికారిలోని తండ్రి మనసును ఆవిష్కరించింది. మద్యం మత్తులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఓ యువకుడి అంతిమయాత్రలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పాల్గొని, అక్కడున్న యువతకు ఆవేదనతో చేసిన హితబోధ అందరినీ కదిలించింది. సమాజం పట్ల బాధ్యతతో ఆయన మాట్లాడిన మాటలు లక్షలాది మందిని ఆలోచింపజేస్తున్నాయి. కాజీపేట పరిధిలో ఓ యువకుడు మద్యం సేవించి వాహనం నడుపుతూ ప్రమాదానికి గురై మరణించాడు. అతని అంతిమయాత్రలో పాల్గొన్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మృతుడి స్నేహితులను ఉద్దేశించి భావోద్వేగంగా ప్రసంగించారు. "క్షణకాలపు మత్తు కోసం జీవితాలను పణంగా పెడుతున్నారు. గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు బానిసలై యుక్త వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. మీరు చనిపోతే నష్టపోయేది కేవలం మీ కుటుంబమే. కూలీనాలీ చేసి మిమ్మల్ని పెంచి పోషిస్తున్న మీ తల్లిదండ్రుల కన్నీళ్లకు ఎవరు సమాధానం చెబుతారు?" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పుట్టినా, చచ్చినా, పార్టీల్లో గెలిచినా, ఓడినా.. అన్నింటికీ తాగడమే పనిగా పెట్టుకున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. మిమ్మల్ని అభివృద్ధి మార్గంలో నడిపించేవాడే నిజమైన స్నేహితుడు. మద్యం తాగమని, గంజాయి పీల్చమని ప్రోత్సహించేవాడు స్నేహితుడు కాదు, మీ జీవితాన్ని నాశనం చేసే శత్రువు. అలాంటి చెడు స్నేహాలను వెంటనే వదిలేయండి. చనిపోయిన మీ స్నేహితుడి శవాన్ని చూసైనా మీలో మార్పు రావాలి" అంటూ హెచ్చరించారు. ప్రతి ఒక్కరి జీవితం ఎంతో విలువైనదని, పేదరికాన్ని జయించి ఉన్నత స్థానాలకు ఎదగాలే తప్ప ఇలా అర్థాంతరంగా తనువు చాలించకూడదని హితవు పలికారు. "జీవితం ఒక్కటే, అది మళ్లీ రాదు. క్రమశిక్షణతో బతకండి. మీ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, వారి ఆశలను నిలబెట్టండి" అని సూచించారు. ప్రస్తుతం ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రసంగానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా, సామాజిక బాధ్యతతో ఆయన స్పందించిన తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రతి పోలీస్ అధికారి ఇలా స్పందిస్తే యువతలో మార్పు రావడం ఖాయమని కామెంట్లు పెడుతున్నారు.

## గ్రామాలకు 21.04 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల..

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి 07( వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీలకు 21 కోట్ల నాలుగు లక్షల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 13 గ్రామీణ మండలాల పరిధిలో ఉన్న గ్రామాలకు 2023-24, 2024-25 సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు 13 జనవరి 2026, 17 ఫిబ్రవరి 2026, 26 ఫిబ్రవరి 2026 తేదీలలో మూడు విడతల్లో మొత్తం ఇప్పటి వరకు దాదాపు 21 కోట్ల 4 లక్షల రూపాయలు విడుదల కావడం జరిగిందని, ఇందులో అన్ టైడ్ గ్రాంట్ 5 కోట్ల 73 లక్షలు, టైడ్ గ్రాండ్ 15 కోట్ల 31 లక్షలు ఉన్నాయని తెలిపారు.అన్ టైడ్ గ్రాంట్ నిధులతో సంబంధిత కరెంట్ బిల్లుల చెల్లింపు, జీతాల చెల్లింపు, ఇతర కార్యాలయ ఖర్చులు ఉంటాయని, టైడ్ గ్రాంట్ నిధులతో అభివృద్ధి పనులకు సంబంధించి వినియోగించడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎక్లాస్ పూర్ లో సీతారామాంజనేయ స్వామి
## ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**పెద్దపల్లి, మంథని, మార్చి 07(వార్త సంధ్య) :** మంథని మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామంలో శనివారం సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో నూతన ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్ అధ్యక్షతన ఆలయ కమిటీ అధ్యక్షులుగా కట్టెకోళ్ల సదానందం యాదవ్, ఉపాధ్యక్షులుగా ఈరవేన పోచ మల్లు, ప్రధాన కార్యదర్శిగా రావుల స్వామి, ముఖ్య సలహాదారుగా బొడ్డు కిష్టయ్య, సహాయ సహాయకులు జంజర్ల సమ్మయ్య, కార్యవర్గ సభ్యులుగా మంథిని వెంకటి, బూడిది వెంకటి, గువ్వల రాజు, గంధం రవీందర్, పంచిక దేవేందర్, చిగురు రాములు, పుల్లె లింగయ్య, మేకల కుమార్, గొర్రె శ్రీనివాస్, మొగిలి శ్రీనివాస్, మర్రి ఐలయ్య, రాదండి రాజనర్సు, లెక్కల సంపత్ రెడ్డి, బొడ్డు సదానందం, నల్ల రాజశేఖర్ తదితరులను ఎన్నుకున్నారు.

## నేడే ఎచ్ పి వి. సింగిల్ డోస్ వ్యాక్సిన్
## పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి లో ప్రారంభం....

**జనరల్ ఆసుపత్రి రామగుండం, సి ఎచ్ సి. మంథని, సుల్తానాబాద్ లలో కూడా ఈ వ్యాక్సిన్ వేస్తారు**

**14 సంవత్సరాల బాలికలు ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మార్చి 07 (వార్త సంధ్య) :** హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్ పి వి ) వ్యాక్సిన్ ను 14 ఏళ్లు నిండిన బాలికలు తప్పనిసరిగా వేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ అన్నారు. మార్చి 8, 2026 నాడు హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమము ప్రారంభమగుచున్న సందర్భముగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ హెడ్ కోటర్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ మరియు జనరల్ ఆసుపత్రి రామగుండం, సి ఎచ్ సి. మంథని, సుల్తానాబాద్ పిల్లల వైద్యు లతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సమన్వయ సమావేశమును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ ( సర్వైకల్ క్యాన్సర్) నుంచి రక్షణ కల్పించే ప్రాథమిక నివారణకు సింగిల్ డోస్ వ్యాక్సిన్ హెచ్ పి వి వ్యాక్సిన్ అని అన్నారు. పెద్ద పల్లి లోని జిల్లా ప్రధాన ఆసుపత్రి యందు మూడు నెలల పాటు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సింగిల్ డోస్ హెచ్ పి వి వ్యాక్సిన్ వేస్తారు అని అన్నారు. అలాగే జనరల్ ఆసుపత్రి రామగుండం, సి. ఎచ్. సి. మంథని, సుల్తానాబాద్ లలో కూడా ఈ వ్యాక్సిన్ వేస్తారు అని అన్నారు. జిల్లాలోని 14 సంవత్సరాల బాలికలు తమ వయస్సు ధృవీకరణ ఐ.డి కార్డ్ తో, పేరెంట్ ను వెంట తీసుకుని రావాలి, పేరెంట్ సమ్మతితో ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. ఖాళీ కడుపు తో కాకుండా ఏమైనా తిని రావాలి అని, వ్యాక్సిన్ వేసుకున్నాక అర గంట వేచి ఉండాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో టివివిపి ఆసుపత్రుల సూపరింటెండ్ డా.శ్రీధర్, ప్రోగ్రాం అధికారులు డా.బి.శ్రీ రాములు, డా.బి.కిరణ్ కుమార్, పెడియాట్రిసియన్ లు డా.రవీందర్, డా. నరేష్, డా. శరత్ కుమార్, డా.శివాని, స్టాటిస్టికల్ అధికారి సాలమ్మ, విసిసిఎం అఖిల పాల్గొన్నారు.

## వికె కోల్ మైన్ బొగ్గు ఉత్పత్తిని
## సింగరేణి కార్మికులు తోనే తియ్యాలి గుర్తింపు

**గౌతంఖని ఓపెన్ కాస్ట్ మూసివేసిన తరువాత,**

**సత్తుపల్లికి డిప్యుటేషన్ పై పంపిన కార్మికులను వెంటనే వీకే కోల్ మైన్ లో నియమించాలి**

**సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కి వినతిపత్రం అందచేసిన గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు**



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 07 ( వార్త సంధ్య) :** కొత్తగూడెం ఏరియా వీకే కోల్ మైన్ లో శనివారం ఉదయం సంస్థ (సి అండ్ ఎండీ) బుద్ధ ప్రకాష్ జ్యోతి, చేతులమీదుగా బొగ్గు రవాణాను ప్రారంభించడానికి వచ్చిన వారిని గుర్తింపు సంఘం ఎఐటియుసి,బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు మరియు కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్ ఆధ్వర్యంలో చైర్మన్ కి వీకే కోల్ మైన్ లో పలు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అనంతరం ఎఐటియుసి నాయకులు మాట్లాడుతూ గౌతంఖని ఓపెన్ కాస్ట్ మూసివేసిన తరువాత జెవిఆర్ ఓసికి డిప్యూటేషన్ పై పంపిన కార్మికులను వెంటనే తిరిగి వీకే కోల్ మైన్ లో నియమించాలని, అదేవిధంగా కోల్ క్రషర్స్ మరియు బొగ్గు రవాణా అన్నీ కూడా సింగరేణి సిబ్బంది తోనే నడిపించి కొత్తగూడెం ఏరియా మనుగడను కాపాడాలని కోరారు,అదేవిధంగా వీకే కోల్ మైన్ నందు సరిపడ సిబ్బంది లేక సరైన ఇన్ఫ్రాస్ట్రక్షన్స్ లేక ఇబ్బంది పడుతున్నారని వాటిపై కూడా దృష్టిసారించి వెంటనే సమకూర్చాలని డిమాండ్ చేశారు, కొత్తగూడెం ఏరియాలోని వికే కోల్ మైన్ ప్రైవేటీకరణ చేసినట్లయితే కొత్తగూడెం లో సింగరేణి కార్మికుల సంఖ్య తగ్గిపోతే కొత్తగూడెం ఏరియా లో ప్రజానీకం మరియు వ్యాపారవర్గం కూడా ప్రత్యక్షంగా పరోక్షంగా మనుగడ లేకుండా పోతుంది ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితి లో డిప్యుటేషన్ మీద వెళ్ళిన కార్మికులను తిరిగి వీకే కోల్ మైన్ లో నియమించి వీకే కోల్ మైన్ ను సింగరేణి కార్మికులు తోనే నడిపించి,కొత్తగూడెం ఏరియా మనుగడను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్ రాములు, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ హుమాయిన్, పిట్ కార్యదర్శిలు ఏం ఆర్ కే ప్రసాద్, మధు కృష్ణ, కమల్, సౌజన్య, నాయకులు హీరాలల్, మెంగన్ రవి, బండారి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి07 (వార్త సంధ్య ) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 6 మార్చి 2026 నుండి ఆరోగ్య శాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు రోజు ఒక ఆరోగ్య కేంద్రములో నిర్వహించు చున్నాము అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ అన్నారు. ఇందులో గైనకాలజీ, పీడియాట్రీక్, ఆర్థోపెడిక్, ఆప్తల్మోలజి, జనరల్ మెడిసిన్ మరియు డెంటల్ స్పెషలిస్ట్ సేవలు అందించడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమం లోని స్పెషలిస్ట్ సేవలను సమీప ఆరోగ్య కేంద్రంలో నిర్వహించినపుడు ప్రజలు సద్వినియోగం చేసు కావాలని కోరారు.

స్పెషలిస్ట్ ఆరోగ్య శిబిరాల షెడ్యూల్ ఇదీ



మార్చ్ 6న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాఘవాపూర్, 7న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఓదల మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అడ్డగుంటపల్లి, 9న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అల్లురు, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పుట్నూర్, 10న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జనగాం మరియు పట్టన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 5- ఇన్ఇంక్లిన్, 11న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాగినేడు , మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లక్ష్మీపూర్, 12న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద్దపల్లి, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామగుండం , 13న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామగుండం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శ్రీరాంపూర్, 14న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంతర్గం, 16న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బసంత్ నగర్,17న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బేగంపేట్, 18న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎలిగేడు, 20న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గద్దలపల్లి, 23న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గర్రెపల్లి, 24న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జూలపల్లి, 25న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కామాన్పుర్, 26న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొలనూర్, 28న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూనారం, 30న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మేడారం, 31న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముత్తారం.

## నగరంలో కాలువ పూడికతీత పనులు వేగవంతంగా పూర్తి...

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**రాబోయే విద్యా సంవత్సరం నాటికి పాఠశాల**

**అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**

**రామగుండంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి 07( వార్త సంధ్య) :** నగరంలో చేపట్టిన కాల్వ పూడికతీత పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండంలో విస్తృతంగా పర్యటించారు. గోదావరిఖని పట్టణం లోని 49 డివిజన్ మార్కండేయ కాలనీ లో జరుగుతున్న కాల్వ పూడికతీత పనులు, ఎన్టిపిసి లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల, రామగుండం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల, రామగుండం లోని లింగాపూర్ సమీపంలోని రోడ్డు విస్తరణ పనులు, పైప్ లైన్ పనులు, రామగుండం లోని మండల పశు వైద్యశాల, రామగుండం లోని సబ్ రిజిస్టర్ కార్యాలయం, అంతర్గాం మండలంలోని కుందనపల్లి కేజీబీవీ లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరిఖని పట్టణంలోని కాలువ పూడిక తీత పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రామగుండంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదులు, కాంపౌండ్ వాల్, భోజనశాల ,పనులను వచ్చే మే మాసం నాటికి పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అన్నారు. కేజీబీవీ కుందనపల్లిలో డార్క్ ఏరియా లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, కోతులు సమస్యలు తలెత్తకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, గ్రౌండ్ లెవెలింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మస్జిద్ చౌరస్తా నుండి లింగాపూర్ వరకు చేపట్టిన 4 లైన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఆటంకంగా ఉన్న పైప్ లైన్ తరలింపు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పశు వైద్యశాలలో సిబ్బంది విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వేసవి దృష్ట్యా త్రాగునీరు అందుబాటులో పెట్టాలని, స్లాట్ ప్రకారం రిజిస్ట్రేషన్ సకాలంలో అయ్యేలా చూడాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ శాఖ డీఈ అప్పల్ నాయుడు, ఏఈ రాజ్ కుమార్, రోడ్లు భవనాలు శాఖ ఏఈ జావిద్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభం

**సుజాతనగర్ పీహెచ్‌సీలో వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్**

**ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు**

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు,**

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 07 (వార్త సంధ్య) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్ వైద్యులు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు ఈ వైద్య శిబిరాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రక్తపరీక్షలు, కీళ్ల సమస్యలకు సంబంధించిన పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు వంటి ఆరోగ్య పరీక్షలను ప్రజలు చేయించుకొని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. అవసరమైతే రోగులను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి అక్కడ అందుబాటులో ఉన్న అన్ని ప్రధాన పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్కానింగ్, ఎక్స్-రే వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నందున అవసరమైన వారికి అక్కడ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలను దశల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు సుజాతనగర్, జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిరోజు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చొప్పున ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాలలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, డెంటల్, ఆప్తమాలజీ వంటి ఆరు విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరాలకు వచ్చే రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పై స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, తాసిల్దార్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఎంపీడీవో భారతి సంబంధిత శాఖల అధికారులు వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు కు సంబంధించిన స్థలంలో నిర్మించిన హోటల్ ని తొలగించాలి

**ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

**బిఎస్పి భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు కొండా చరణ్**





**భద్రాద్రి జిల్లా బ్యూరో మార్చ్ 7 (వార్త సంధ్య) :** చర్ల మండల కేంద్రంలోని సాయిబాబా గుడి మెట్ల వద్ద రోడ్డు స్థలాన్ని ఆక్రమించి కట్టిన హోటల్ ని తక్షణమే తొలగించాలని బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారి డిప్యూటీ తాసిల్దార్ కి మేజర్ గ్రామపంచాయతీ అధికారి కార్యదర్శి సురేష్ కి వినత పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు కొండా చరణ్ మాట్లాడుతూ చర్ల మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించడం పరిపాటుగా మారిందని అన్నారు ఇల్లులు ఉన్నవాళ్లు స్థలాలు ఉన్నవాళ్లు ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు పలుకుబడితో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు అలాంటి వాళ్ళ పట్ల రెవిన్యూ అధికారులు మెతక వైఖరి ప్రదర్శించడం సరైంది కాదని అన్నారు ఈ ఆక్రమణల్లో భాగంగానే కొందరు చర్ల మండల కేంద్రంలోని సాయిబాబా గుడి వద్ద రోడ్డుకు సంబంధించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించి అందులో బోజన హోటల్ నడుపుతున్నారని తెలిపారు అంత బహిరంగంగా ఆక్రమణలు చేస్తూ పెద్ద పెద్ద కట్టడాలు కడుతూ హోటల్స్ నడుపుతుంటే అధికారులకు కనబడలేదా అని ప్రశ్నించారు ఇప్పటికైనా అధికారులు స్పందించాలని తక్షణమే ఆ రోడ్డు స్థలంలో నిర్మించిన ఇంటిని తొలగించాలని ఆక్రమణకు పాల్పడ్డ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా రెవెన్యూ అధికారులు జాగ్రత్త పడాలని కోరారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా
## శ్రీ రాగా ప్లే & హై స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చ్ 07 (వార్త సంధ్య) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీ రాగా ప్లే & హై స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 52వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి బానోత్ కళావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ బానోత్ కళావతి గారిని స్కూల్ డైరెక్టర్ మల్లారపు కవిత పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించి చీరను బహుమతిగా అందజేశారు. అనంతరం డైరెక్టర్ మల్లారపు కవిత గారిని కార్పొరేటర్ బానోత్ కళావతి మరియు ధన్‌రాజ్ దంపతులు ఘనంగా సన్మానించారు. తదుపరి మహిళా ఉపాధ్యాయులు మరియు మహిళా తల్లిదండ్రుల కోసం "సరదా సరదాగా" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సరదా గేమ్స్, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించి పాల్గొన్న వారందరినీ ఆనందపరిచారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి మహిళకు చీరలు, కుంకుమ భరణి, పువ్వులు మరియు స్వీట్లు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, సర్వేశ్వరరావు, రాజ్‌కుమార్, కీర్తి, పుష్పలత, అనుష, శ్రావణి, అన్నపూర్ణ, భువన, సుష్మా, కవిత, రేష్మా తదితరులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'

**కార్డన్ సెర్చ్ చేస్తుండగా విజయవాడలో కాల్పులు**

**రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధ తనిఖీలు చేస్తున్న పోలీసుల**

**సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు**

**నివాసితుల ధ్రువీకరణ పత్రాలు తనిఖీ**

**అనుమానిత వ్యక్తులు, గంజాయి విక్రయాలపై ముమ్మర తనిఖీలు**



ఆపరేషన్ 'వజ్ర ప్రహార్'లో భాగంగా పోలీసుల, ఈగల్ టీమ్ రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా పోలీసులు నిర్బంధ తనిఖీలు చేపట్టారు. పలు జిల్లాల్లో 100కు పైగా బృందాలతో సోదాలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలో తుపాకి కలకలం రేపింది. పోలీసులు కార్టన్ సెర్చ్ చేస్తుండాగ దుండగుడు పోలీసుల పైకి కాల్పులకు యత్నించాడు. ఈ ఘటన విజయవాడ నగరంలో చోటు చేసుకుంది.బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో దుండగుడు పోలీసులు, ఈగల్ టీమ్ అధికారుల పైకి కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. అనంతరం పారిపోతున్న నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని తెలంగాణలోని వరంగల్‌కు చెందిన మురళిగా గుర్తించారు. ట్రిగ్గర్ ప్రెస్ చేయకపోవడంతో బుల్లెట్ ఛాంబర్‌లోకి రాలేదని పోలీసులు తెలిపారు.ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు నిర్బంధ తనిఖీలు చేస్తున్నారు. జిల్లా ఎస్పీల ఆదేశాలతో తెల్లవారుజాము నుంచే పలు జిల్లాల్లో వందకు పైగా బృందాలతో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలు సీజ్ చేయడంతో పాటు అనుమానిత వ్యక్తులు, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు.ఆపరేషన్ "వజ్రప్రహార్" కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సుమారు 10 టీములుగా సిబ్బంది ఏర్పడి రాముడు కుంట చెరువు ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. శ్రీకాకుళం నగరంలోని వాంబే కోలనీ, టెక్కలిలోని ఆది ఆంధ్రా వీధి, కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ తదితర ప్రాంతాల్లో దాడులు చేశారు. దాడుల్లో మద్యం బాటిల్స్‌తో పాటు పత్రాలు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ కార్యక్రమం చేపట్టారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో పోలీసులు నేరాలపై ఉక్కుపాదం మోపారు. పట్టణంలోని మోడల్ కాలనీలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, అంగళ్లు, రాయచోటి పట్టణాల్లో కార్టన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఆ ప్రాంత ప్రజలతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కర్నూలు బంగారు పేటలో నాటుసారా స్థావరాలపై పోలీసు, ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. దాడుల్లో పట్టుబడిన సారాను పోలీసులు పారబోసారు. సారా తయారీదారుపై కేసు నమోదు చేస్తామన్నారు.చీరాల పట్టణంలోని ఉజిలిపేటలో పోలీసులు నిర్బంధ తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 25 బైకులు, 2 కార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కృష్ణా జిల్లా పామర్రులోని హరి గోపాల్ నగర్‌లో 150 మంది పోలీసుల బృందంతో తనిఖీలు చేపట్టారు. స్థానిక ప్రజలతో గాంజా వొద్దు బ్రో, డ్రగ్స్ వొద్దు అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. నంద్యాల రైల్వే స్టేషన్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్ వజ్రపహార్‌లో భాగంగా రైల్వేస్టేషన్ లో పార్సిల్ కేంద్రంతో పాటు పలు ప్రదేశాలను పరిశీలించారు. ప్రయాణికుల చేతిలో ఉన్న సంచులను తనిఖీ చేశారు.

# 'గుత్తేదారు మార్పు అతిపెద్ద తప్పు'

**పోలవరంపై కుండబద్దలు కొట్టిన కాగ్ నివేదిక**

**పోలవరంపై కాగ్ నివేదికను శాసనసభకు సమర్పించిన ప్రభుత్వం**

**పోలవరం ప్రాజెక్టులో వైఎస్సార్సీపీ ప్రభుత్వ చర్యలను తప్పుపట్టిన కాగ్**

**జగన్ ప్రభుత్వం తీరు వల్లే డయాఫ్రం వాల్ ధ్వంసమైనట్లు వెల్లడి**



పోలవరం ప్రాజెక్టులో జగన్ సర్కారు చేసిన గుత్తేదారు మార్పు అతిపెద్ద తప్పు అని కాగ్ కుండబద్దలు కొట్టింది. పాత కాంట్రాక్టర్‌ను ముందే తప్పించడం మరో తప్పని తేల్చిచెప్పింది. పోలవరం అథారిటీ చెప్పినా జగన్ సర్కారు పెడచెవినపెట్టడం వల్ల 2019 వరకు చేసిన కట్టడాలకు దిక్కులేకుండా పోయిందని పేర్కొంది. అందుకే డయాఫ్రమ్ వాల్, ఎగువ కాఫర్‌డ్యామ్‌లకు తీవ్ర నష్టం వాటిల్లిందని కాగ్ స్పష్టం చేసింది. రివర్స్ టెండర్ల వల్ల నిధులు ఆదాచేశామని వైఎస్సార్సీపీ చెబుతున్నవన్నీ ఉత్తుత్తి మాటలేనని కాగ్ ఉద్ఘాటించింది.అందుకే రక్షణ లేకుండా పోయింది: పోలవరం ప్రాజెక్టుపై కాగ్ రూపొందించిన నివేదికను ప్రభుత్వం శుక్రవారం శాసనసభకు సమర్పించింది. 2017-18 నుంచి 2022-23 మధ్య చేసిన పనులు, నిబంధనల ఉల్లంఘనలు, భూసేకరణలో జాప్యం తీరును సమగ్రంగా ప్రస్తావించింది. జగన్ ప్రభుత్వం చర్యలు రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై తీవ్ర ప్రభావం చూపాయని కాగ్ స్పష్టం చేసింది. 2019లో గుత్తేదారును మార్చడం వల్ల అప్పటివరకు చేసిన పనులకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొంది. ఆ తర్వాత వచ్చిన భారీ వరదలకు డయాఫ్రం వాల్ ధ్వంసమైందని కాగ్ నివేదిక తప్పుపట్టింది. గుత్తేదారును మార్చొద్దని పోలవరం అథారిటీ సీఈవో ఇచ్చిన సలహాను నాటి ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆక్షేపించింది.

**ఉమ్మడిగా నిర్ణయం:** జాతీయ ప్రాజెక్ట్ అయిన పోలవరం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ పరిధిలోకి రాకపోయినా, కమిటీ వేసి, దాని సిఫార్సుల పేరుతో గుత్తేదారును మార్చడాన్ని కాగ్ ఎండగట్టింది. భారీ వరదలకు డయాఫ్రం వాల్ ధ్వంసం కావడంతో దానికి చేసిన ఖర్చు రూ. 399 కోట్ల 77 లక్షల రూపాయలు వృథా కాగా, దిద్దుబాటు పనులకు రూ. 2 వేల 20 కోట్ల 5 లక్షలు, కాఫర్ డ్యాంల రక్షణకు రూ. 143 కోట్ల 50 లక్షలు అదనంగా వెచ్చించాల్సి వచ్చిందని కాగ్ విశ్లేషించింది. ప్రణాళికాబద్ధమైన షెడ్యూలును పాటించలేదంటూ డయాఫ్రం వాల్ నిర్మాణానికి ముందే నదీ ప్రవాహాన్ని స్పిల్ వే, స్పిల్ ఛానల్ ద్వారా మళ్లించలేదని ఉదహరించింది. అన్ని పనులూ సమాంతరంగా చేయాలని కేంద్ర, రాష్ట్ర సంస్థలు ఉమ్మడిగా నిర్ణయించాయన్న ప్రభుత్వ వాదనను కాగ్ సమర్థించలేదు.

**కేంద్రం నిర్ణయం తీసుకునే వరకు ఆగాలి:** పోలవరం ప్రాజెక్టులో జగన్ సర్కారు రివర్స్ టెండర్లకు వెళ్లిందని కాగ్ గుర్తుచేసింది. దీనిపై ప్రాజెక్టు అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రభుత్వానికి లేఖ రాస్తూ, 'మళ్లీ టెండర్లు పిలవొద్దు, అలాచేస్తే ప్రాజెక్టు అనిశ్చితిలో పడుతుందని చెప్పినట్లు కాగ్ ప్రస్తావించింది. వ్యయం భారీగా పెరుగుతుందని, అప్పటికే ఉన్న కాంట్రాక్టర్‌తో ఒప్పందం ముందస్తుగా రద్దు చేసుకొని, తిరిగి టెండర్లు పిలవాలన్న ఆలోచన విరమించుకోవాలని, లేదంటే కేంద్రం నిర్ణయం తీసుకునే వరకు ఆగాలని హెచ్చరించినట్లు కాగ్ పేర్కొంది. దీన్ని నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని నివేదికలో కాగ్ పేర్కొంది.ఆ నిబంధనను కాలరాశారు: పోలవరం ప్రాజెక్టుతో పాటు జలవిద్యుత్ కేంద్రానికి ప్రభుత్వం రివర్స్ టెండర్లు నిర్వహించిందని తెలిపింది. గుత్తేదారులకు నిర్దేశించిన అర్హతలు ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా లేవని కాగ్ స్పష్టం చేసింది. పైగా బిడ్డింగ్‌కు 21 రోజులకు బదులు 16 రోజులే గడువిచ్చారని వెల్లడించింది. మరింత సమయమివ్వాలని 14 మంది బిడ్డర్లు కోరినా పట్టించుకోలేదని పేర్కొంది. చివరకు ఒక్క బిడ్డర్ మాత్రమే టెండర్ ప్రక్రియలో పాల్గొనగా, ఆ సంస్థకే ఖరారు చేశారని తెలిపింది. కనీసం ఇద్దరు పాల్గొనాలన్న నిబంధనను కాలరాశారని కాగ్ తన నివేదికలో పేర్కొంది.కోట్ల రూపాయలు వృథా: ప్రధాన పనికి అనుబంధంగా అదనపు పనులను ఒప్పంద ధరల ప్రకారం గుత్తేదారు చేపట్టాలని కాగ్ గుర్తుచేసింది. అలాకాకుండా 2020-21 ఎస్ఎస్ఆర్ ధరలతో రూ. 669 కోట్ల 48 లక్షల రూపాయలకు అదే గుత్తేదారుకు అప్పగించారని వెల్లడించింది. రివర్స్ టెండర్లతో రూ. 628 కోట్ల 43 లక్షలు ఆదా అయినట్లు ప్రభుత్వం చెబుతున్నా, ఈ అదనపు పనులకు కట్టబెట్టిన సొమ్మును లెక్కించినప్పుడు ఆ వాదనకు అర్థం లేదని కాగ్ తేల్చిచెప్పింది. పోలవరం అథారిటీ అనుమతి లేకుండా కుడివైపు సొరంగాల ప్రవాహ సామర్థ్యం 40 వేల క్యూసెక్కులకు పెంచి పనులు అప్పగించారని కాగ్ పేర్కొంది. ఇందుకు అప్పటికే పూర్తైన లైనింగ్, స్టీల్ సపోర్టులను కూల్చివేశారని తెలిపింది. రూ. 14 కోట్ల 11 లక్షల రూపాయలు వృథా అయ్యాయని కాగ్ వెల్లడించింది.

# మద్యం కుంభకోణం కేసు ముగ్గురికి షరతులతో కూడిన బెయిల్

**బూనేటి చాణక్య(ఏ8), బాలాజీ కుమార్ యాదవ్(ఏ35), నవీన్ కృష్ణ(ఏ36)లకు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు**

**ఇతర నిందితులు ఇప్పటికే బెయిల్ పొందారన్న హైకోర్టు**




మద్యం కుంభకోణం కేసులో నిందితులు బూనేటి చాణక్య(ఏ8), బాలాజీ కుమార్ యాదవ్(ఏ35), నవీన్ కృష్ణ(ఏ36)లకు శుక్రవారం హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. నిందితులు ఇప్పటికే సుదీర్ఘ కాలం జైల్లో ఉన్నారని, తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న ఇతర నిందితులు ఇప్పటికే బెయిల్ పొందారని న్యాయస్థానం గుర్తుచేసింది. విచారణకు ముందే సుదీర్ఘ కాలం జైల్లో ఉంచడం శిక్ష విధించినట్లవుతుందని తెలిపింది. జైల్లో ఉంచడం నిందితుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని వ్యాఖ్యానించింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని షరతులతో బెయిలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు షరతులను ఉల్లంఘిస్తే బెయిలు రద్దు కోసం ప్రాసిక్యూషన్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఈమేరకు తీర్పు ఇచ్చారు.

**కీలక పాత్ర:** మద్యం సరఫరా కంపెనీల, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూళ్ల కోసం రూపొందించిన నెట్‌వర్క్ నిర్వహణలో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ప్రతినిధిగా బూనేటి చాణక్య కీలక పాత్ర పోషించారు. బాలాజీ కుమార్ యాదవ్, ఎద్దల నవీన్‌కృష్ణ వైఎస్సార్సీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రధాన అనుచరులుగా ఉన్నారు. చెవిరెడ్డి ఆదేశాల మేరకు ముడుపుల సొమ్ము తరలింపులో క్రియాశీలకంగా వ్యవహరించారు. వీరు ముగ్గురు బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేసిన న్యాయమూర్తి శుక్రవారం నిర్ణయాన్ని ప్రకటించారు. షరతులతో బెయిలు మంజూరు చేశారు.

**షరతులు:**

ఆరోరణు ఎదుర్కొంటున్న వారు స్థిర, చరాస్తుల వివరాలను అఫిడవిట్ రూపంలో కోర్టు ముందుంచాలి. విచారణ కోర్టు సంతృప్తి మేరకు ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలి. దిగువ కోర్టులో పాస్‌పోర్టులు అప్పగించాలి. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదు. దర్యాప్తు అధికారికి (ఐవో)కి సమాచారం ఇవ్వకుండా రాష్ట్రం దాటి వెళ్లొద్దు. దర్యాప్తునకు సహకరిస్తూ ఎప్పుడు కోరితే అప్పుడు ఐవో ముందు హాజరు కావాలి. సాక్షులను పరోక్షంగా, ప్రత్యక్షంగా ప్రభావితం చేయడానికి వీల్లేదు. సాక్ష్యాధారాలను తారుమారు చేయకూడదు. విచారణ సమయంలో తప్ప సహ నిందితులను కలవడానికి వీల్లేదు. సాక్షులను కలిసే ప్రయత్నం చేయకూడదు. స్థిర, చరాస్తులు, బ్యాంక్ ఖాతాల వివరాలు, డీమ్యాట్ ఖాతాలు, వ్యాపార ప్రయోజనాల వివరాలను రెండు వారాల్లో అఫిడవిట్ రూపంలో విచారణ కోర్టు ముందుంచాలి.కేసు విచారణ ముగిసేంత వరకు ఈ కేసుకు సంబంధించిన వివరాలను పత్రికలు, ప్రసార మధ్యమాలు, సామాజిక మాధ్యమాలకు వెల్లడించడానికి వీల్లేదు. నిందితులు వెల్లడించిన, ప్రాసిక్యూషన్ గుర్తించిన ఆస్తులను విచారణ కోర్టు అనుమతి లేకుండా విక్రయించడం, తనఖా పెట్టడం, మూడోపక్షానికి వాటిపై హక్కులు కల్పించకూడదు. దర్యాప్తు సంస్థకు సమాచారం ఇవ్వకుండా నేర ఘటనలో సంబంధం ఉన్న కంపెనీలు, సంస్థలు, బ్యాంక్ ఖాతాలను నిందితులు నిర్వహించకూడదు. ఫోన్ నంబర్లను దర్యాప్తు అధికారికి అందజేయాలి. ఫోన్‌లో ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. నంబరు మారిస్తే ఆ విషయాన్ని ఐవోకు వెంటనే తెలియజేయాలి. తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలి.

# విద్య, వైద్యంలో ప్రజలకు అందించే సేవ గొప్పది

**మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్**

**విద్య, వైద్యంలో ప్రజలకు అందించే సేవ గొప్పది**

**లయన్స్ క్లబ్ ఆస్పత్రిలో రెటీనా మాడ్యులర్ ఓటీని ప్రారంభించిన మార్గదర్శి ఎండీ**

**సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలని సర్కార్‌కు విజ్ఞప్తి**



విద్య, వైద్యం, విపత్తుల వేళ ప్రజలకు అందించే సేవ గొప్పదని మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా రేకుర్తిలోని లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో రెటీనా మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌ను శైలజా కిరణ్ ప్రారంభించారు. డాక్టర్ భాస్కర్ మడేకర్ ఆశయ సాధన దిశగా పేదలకు కంటి చూపును అందించే లక్ష్యంతో ఈ ఆస్పత్రి పని చేస్తోందని కొనియాడారు.కరీంనగర్ లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి బృందం 9 వేల 272 గ్రామాల్లో పేదలకు మెరుగైన సేవల్ని అందించడం ప్రశంసనీయమని శైలజా కిరణ్ కొనియాడారు. ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ మడేకర్ అప్పట్లో మార్గదర్శి చిట్‌ఫండ్ ఖాతాదారుడని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రేకుర్తి కంటి ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి చిట్‌ఫండ్ వైస్ ప్రెసిడెంట్స్ రాజాజీ, శ్రీనివాస్, రికవరీ జీఎం చంద్రయ్య, బ్రాంచి మేనేజర్ సురేశ్ బాబు, రేకుర్తి ఆసుపత్రి వైస్ ఛైర్మన్ చిదుర సురేశ్, కార్యదర్శి సురేశ్, లయన్స్ క్లబ్ సభ్యులు కోల అన్నారెడ్డి, డాక్టర్ మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.'ఇప్పటి వరకు ఈ ఆసుపత్రి డాక్టర్లు ఎనిమిది లక్షలకు పైగా ప్రజలకు సేవలు అందించారు. ఇక్కడ చాలా నోబెల్ టీమ్ ఉంది. పేద ప్రజలకు ఎంతో కమిట్‌మెంట్‌తో సేవ చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ కూడా ఈ ఆసుపత్రిలో ధైర్యంగా చూపించుకోవచ్చు. ఇక్కడ కేవలం రూ.50 ఫీజుతో కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు చేస్తారు. ఈ ఆసుపత్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తోంది. లయన్స్ క్లబ్ సభ్యులందరూ కూడా ఎంతో సేవా దృక్పథంతో ఎన్నో మంచి కార్యాలు చేయాలి. అలాగే కరీంనగర్ జిల్లా ప్రజలు ఈ సేవలను అందుకోవాలి. దీని గురించి వాళ్లు ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేయటంతో పాటు గ్రామాల్లో క్యాంపులు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. ఇప్పటికి దాదాపుగా 8000 క్యాంప్స్ నిర్వహించారు. ఈ ఆస్పత్రి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు.

# మూడు రోజుల సాంబార్‌పై గొడవ.. వివాహిత ఆత్మహత్య

**మూడు రోజుల నాటి సాంబార్‌పై భర్తతో గొడవ**

**తీవ్ర మనస్తాపంతో పురుగుల మందు తాగిన 27 ఏళ్ల మహిళ**

**ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి**

**బెంగళూరులో జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు**



బెంగళూరులో ఒక దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో వండిన పాత సాంబార్ విషయంలో భర్తతో జరిగిన గొడవ కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర సంఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... 27 ఏళ్ల కావ్యకు రంగస్వామితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. గురువారం రోజున మూడు రోజుల క్రితం వండిన సాంబార్‌ను కావ్య మళ్లీ వేడి చేసి భర్తకు వడ్డించింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య వాగ్వాదం మొదలైంది. ఈ గొడవ తీవ్రస్థాయికి చేరడంతో భర్త ఆమెను దూషించి, దాడికి యత్నించినట్లు తెలుస్తోంది.భర్త ప్రవర్తనతో తీవ్రంగా నొచ్చుకున్న కావ్య, ఇంట్లో వ్యవసాయానికి వాడే పురుగుల మందు తాగేసింది. కొద్దిసేపటి తర్వాత ఆమె వాంతులు చేసుకోవడం గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే కావ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# హైదరాబాద్‌లో బీర్ బాటిల్‌లో చేప పిల్ల కలకలం

**మల్లాపూర్‌లోని వైన్ షాపులో వెలుగుచూసిన ఘటన**

**కింగ్‌ఫిషర్ బీరులో చేపను చూసి అవాక్కైన కస్టమర్**

**నిలదీస్తే దురుసుగా ప్రవర్తించిన షాపు సిబ్బంది**



హైదరాబాద్‌లో ఓ వింత ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి కొనుగోలు చేసిన బీర్ బాటిల్‌లో ఏకంగా ఓ చేప పిల్ల సజీవంగా ఈదుతూ కనిపించడం కలకలం రేపింది. నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో ఈ సంఘటన వెలుగుచూసింది.వివరాల్లోకి వెళితే.. మల్లాపూర్‌లోని జేపీ వైన్ షాపులో నిన్న ఓ కస్టమర్ కింగ్‌ఫిషర్ లైట్ బీర్ కొనుగోలు చేశాడు. దానిని తాగేందుకు మూత తీయగా, అందులో చిన్న చేప పిల్ల కదులుతూ కనిపించింది. ఊహించని ఈ పరిణామంతో అవాక్కైన అతను, వెంటనే వైన్ షాపు నిర్వాహకుడిని సంప్రదించి విషయం చెప్పాడు.అయితే, షాపు సిబ్బంది బాధ్యతాయుతంగా స్పందించకపోగా, కస్టమర్‌తో దురుసుగా ప్రవర్తించారు. బీర్లను తాము తయారు చేయమని, ఏమైనా ఉంటే నేరుగా కంపెనీని అడగాలంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. వారి తీరుతో అసహనానికి గురైన ఆ కస్టమర్, బీర్ బాటిల్‌లో చేప కదులుతున్న దృశ్యాలను తన ఫోన్‌లో వీడియో తీశారు. అనంతరం దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

# గుమ్మడికాయ చేసే మేలెంతో తెలుసా

**గుమ్మడికాయలో పోషకాలు అనేకం**

**ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని లాభాలు ఉన్నాయంటున్న నిపుణులు**



గుమ్మడికాయ అనగానే హల్వా, పప్పు, సాంబార్, వడియాలు, సూప్ చేసుకోవడానికో ఉపయోగిస్తాం. కానీ, దీనివల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇందులో మినరల్స్, విటమిన్స్, ఫైబర్ అధికంగా ఉంటాయని చెబుతున్నారు. ఈ క్రమంలో గుమ్మడికాయ వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం!

**కంటి ఆరోగ్యం :** క్యారెట్లు, ఆకుకూరలు, చిలగడదుంపల్లో మాదిరిగానే గుమ్మడికాయలోనూ బీటా కెరొటిన్ పుష్కలంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే ఇది శరీరంలోకి చేరుకున్న తర్వాత విటమిన్ ఏ రూపంలోకి మారిపోతుందని అధ్యయనం పేర్కొంది. విటమిన్ దృష్టిని కాపాడటానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి , ఆరోగ్యకరమైన చర్మం, ఎముకలను నిర్వహించడానికి, కణాల పెరుగుదల, విభజనను నియంత్రించడానికి సహాయపడుతుందని తెలిపింది. ఇది గుండె జబ్బులు, కొన్ని క్యాన్సర్ల నుంచి కూడా రక్షణ కల్పిస్తుందని చెబుతుంది. అరకప్పు గుమ్మడి ముక్కలతోనే మనకు రోజుకు అవసరమైన విటమిన్ ఏ లభిస్తుందని సూచిస్తున్నారు.

**క్యాన్సర్ నివారణ :** గుమ్మడికాయ గింజల్లో డయాబెటిస్ నిరోధక, క్యాన్సర్ నిరోధక లక్షణాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుమ్మడికాయ గింజలలో లభించే జింక్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, సెలీనియం మూలకాలు వాటిని పోషక శక్తి కేంద్రంగా, ఆర్థరైటిస్, వాపు, ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు నివారణగా పనిచేస్తుందని అధ్యయనం పేర్కొంది.

**హైబీపీ అదుపులో :** గుమ్మడికాయలోని పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటుని అదుపులోకి తీసుకొస్తుందంటున్నారు నిపుణులు. తద్వారా పక్షవాతం, గుండె సమస్యలు తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు. అంతేకాదు, ఎముక సాంద్రత కూడా మెరుగవుతుందట. గుమ్మడికాయ గింజలలో లభించే అధిక మెగ్నీషియం, జింక్, అమైనో ఆమ్లాల వల్ల అధిక రక్తపోటు, గుండె జబ్బులు, అధిక రక్త చక్కెర ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఎశ్రీవజవశ్రీఖఅఎఎశ్రీఱఅఱఎ అధ్యయనం పేర్కొంది.

**బరువు నియంత్రణ :** గుమ్మడిలో ఫైబర్ అధికంగా, కేలరీలు తక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో తయారు చేసిన ఆహార పదార్థాలను కొద్దిగా తీసుకున్నా వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, బరువు నియంత్రణలో ఉంటుందని, డైట్‌లో ఉన్నవారూ దీన్ని తినొచ్చని సూచిస్తున్నారు. అలాగే, మలబద్ధకం కూడా దూరమవుతుందని తెలియజేస్తున్నారు.

**మంచి నిద్ర :** గుమ్మడి గింజల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో అమ్లం ఉంటుందట. ఇది శరీరంలో సెరోటోనిన్, మెలటోనిన్ వంటి నిద్ర హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పడుకునే ముందు కొన్ని గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల నిద్ర నాణ్యత పెరుగుతుందని సూచిస్తున్నారు.

**రోగనిరోధక శక్తి బలోపేతం :** రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు గుమ్మడిలో పుష్కలంగా ఉంటాయి. ఈ క్రమంలో బీటా కెరొటిన్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, ఫోలేట్ కూడా గుమ్మడిలో ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఫలితంగా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జలుబు, ఫ్లూపై పోరాడే శక్తి శరీరానికి లభిస్తుందని చెబుతున్నారు.

**అందానికీ మంచివట! :** గుమ్మడిలో ఉండే విటమిన్ సి కొలాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు తోడ్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది సూర్యుడి యూవీ కిరణాల నుంచి కాపాడుతుందని తెలియజేస్తున్నారు.గుమ్మడికాయ తినడం ఆరోగ్యానికి మంచిదే, కానీ అలర్జీ ఉన్నవారు తీసుకోకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. అతిగా తీసుకున్నా శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని హెచ్చరిస్తున్నారు. క్యాండీలు, కేక్, ఫిల్లింగ్స్‌లోనూ గుమ్మడికాయని వాడతారని, అవి ఆరోగ్యానికి అంత మంచిది కాదని సూచిస్తున్నారు.

# విస్తరిస్తున్న కడుపు క్యాన్సర్ లక్షణాలు వెల్లడించిన నిపుణులు



ఎసిడిటీ, గ్యాస్ బాధల్ని మనం చాలాసార్లు పెద్దగా పట్టించుకోము. ఏదో ఒక యాంటాసిడ్ మాత్ర వేసుకుంటాము. అయితే, ఇవే బాధలు దీర్ఘకాలికంగా కొనసాగుతుండటం, వీటికి తోడు తరచూ పొట్టలో నొప్పి, బరువు తగ్గడం, మలంలో రక్తం వంటి లక్షణాలు కనిపిస్తుంటే నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు నిపుణులు. ఇలాంటి లక్షణాల వెనుక ఒక్కోసారి ప్రమాదకర క్యాన్సర్లు దాగి ఉండే ప్రమాదం ఉందని హెచ్చస్తున్నారు. ఈ క్రమంలో కడుపు క్యాన్సర్ సూచించే హెచ్చరిక సంకేతాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!కడుపు క్యాన్సర్‌ను గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు. కడుపులో క్యాన్సర్ కణాలు పెరగడం ప్రారంభించినప్పుడు ఇది సంభవిస్తుంది. ఇది కడుపులోని ఏ భాగంలోనైనా రావచ్చు. అయితే, చాలా సందర్భాలలో, కడుపు ప్రధాన భాగంలో ఇది కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఈ వ్యాధి సాధారణంగా నెమ్మదిగా మొదలవుతాయి. దీని ప్రారంభ సంకేతాలు ఎసిడిటీ, అజీర్ణం లేదా అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పి వంటి సాధారణ జీర్ణక్రియ సమస్యలను పోలి ఉండటం వల్ల దీనిని గుర్తించడం చాలా కష్టం. అయితే, హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడతాయంటున్నారు నిపుణులు.

**నిరంతర అజీర్ణం :** ఉదర పై భాగంలో స్వల్పంగా ఎసిడిటీ లేదా మంట కలగడం సాధారణం. అయితే, ఇది పదేపదే లేదా నిరంతరం వస్తున్నప్పుడు, అది కడుపు క్యాన్సర్ సంకేతం కావచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సాధారణంగా మంట లేదా అసౌకర్యమనేది బొడ్డు పైన అనిపిస్తుందట. సాధారణ యాంటాసిడ్లు లేదా జీవనశైలి మార్పులతో ఇది తగ్గకపోవచ్చుట. ఎటువంటి స్పష్టమైన కారణం లేనప్పటికీ, ఈ రకమైన అజీర్ణం వారాల పాటు లేదా నెలల తరబడి మళ్లీ మళ్లీ వస్తూ ఉంటుంది.

**కడుపు నిండినట్లు అనిపించడం :** తక్కువ పరిమాణంలో ఆహారం తీసుకున్నప్పటికీ, కడుపు నిండినట్లు అనిపిస్తుందని అష్ట్రం.బని అధ్యయనం పేర్కొంది. కడుపు విపరీతంగా నిండిపోయినట్లు, బిగుతుగా లేదా బరువుగా అనిపించడం వల్ల వ్యక్తి భోజనం మధ్యలోనే తినడం ఆపేయవచ్చంటున్నారు నిపుణులు. కడుపు పై భాగం లేదా మధ్య భాగంలో గడ్డ పెరగడం వల్ల ఇలా అనిపిస్తుందని చెబుతున్నారు.

**కారణం లేకుండా బరువు తగ్గడం :** డైటింగ్ లేదా వ్యాయామం చేయకుండానే బరువు తగ్గడం ఆందోళకరమైన విషయం. కడుపు క్యాన్సర్‌లో గడ్డలు అనేవి జీర్ణక్రియకు, పోషకాల శోషణకు అడ్డుపడటం వల్ల క్రమంగా బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇది ఆకలిని కూడా తగ్గిస్తుందట. దీనివల్ల వ్యక్తి తక్కువగా తినొచ్చు. శరీరం క్యాలరీలను, పోషకాలను సమర్థవంతంగా గ్రహించలేకపోవచ్చుట. ఇది శరీరం కృశించిపోవడానికి, బలహీనతకు, కండరాల క్షీణతకు దారితీస్తుందట.

**నిరంతర కడుపు నొప్పి లేదా అసౌకర్యం :** కడుపు పైభాగంలో మొండిగా, నిరంతరంగా వచ్చే నొప్పి లేదా అసౌకర్యం మరొక ముఖ్యమైన సంకేతమని ఎవ్వఎతీష్ట్రముశ్రీష్ట్ర.జఱఎ.స్త్రశీజ. అధ్యయనం పేర్కొంది. తిన్న ఆహారం సరిపడక అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పిలా కాకుండా, ఈ నొప్పి తగ్గకుండా వస్తుందట. అలాగే, కాలక్రమేణా నెమ్మదిగా తీవ్రమవుతుందట. ఇది సాధారణంగా బొడ్డుకు సరిగ్గా పై భాగంలో అనిపిస్తుందని చెబుతున్నారు. ఈ నొప్పి గడ్డ వల్ల గానీ, కడుపు లోపలి పొరపై పుండ్లు ఏర్పడటం వల్ల గానీ లేదా సమీపంలోని ఇతర అవయవాలపై ఒత్తిడి పడటం వల్ల గానీ రావచ్చు. కొన్నిసార్లు ఈ నొప్పి రాత్రి సమయాల్లో లేదా భోజనం చేసిన తర్వాత మరింత ఎక్కువగా అనిపిస్తుందట.

**వికారం, వాంతులు :** తరచుగా వికారం అనిపించడం లేదా భోజనం చేసిన తర్వాత పదేపదే వాంతులు కావడం కడుపులో సమస్య ఉన్నదనడానికి సంకేతం కావచ్చని ఎశ్రీవజవశ్రీఖఅఎఎశ్రీఱఅఱఎ అధ్యయనం పేర్కొంది. కడుపు క్యాన్సర్ ఉన్న కొన్ని సందర్భాల్లో, గడ్డ ఉదర ద్వారం వద్ద అడ్డుపడటం వల్ల పదేపదే వాంతులు అవుతాయని చెబుతున్నారు

**నల్లటి లేదా తారు రంగు మల విసర్జన లేదా మలంలో రక్తం :** నల్లగా, తారు రంగులో ఉండే మలం అనేది కడుపుతో సహా జీర్ణవ్యవస్థ పైభాగంలో రక్తస్రావం జరుగుతోందనడానికి సంకేతమంటున్నారు నిపుణులు. రక్తం ప్రేగుల గుండా ప్రయాణించేటప్పుడు నల్లగా మారుతుంది, ఇది కడుపులోని గడ్డ వల్ల కలిగే పుండును సూచిస్తుంది. కొన్నిసార్లు ఈ రక్తస్రావం చాలా నెమ్మదిగా జరిగి బయటకు స్పష్టంగా కనిపించకపోవచ్చు, కానీ ఇది రక్తహీనతకు దారితీస్తుంది. దీనివల్ల చర్మం పాలిపోవడం, బలహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు. మలంలో రక్తం నేరుగా కనిపించడం కూడా ఒక ప్రమాదకరమైన హెచ్చరిక సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు



మనిషి ఆరోగ్యానికి ప్రోటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.

### దాహం పెరుగుతుంది

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

### నోటి దుర్వాసన దీని లక్షణమే..

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.

### మలబద్ధకం

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

### ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

### ఒంటి నొప్పులు..

ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# తిరుమల, విశాఖ ఎర్రమట్టి దిబ్బలకు అంతర్జాతీయ ఖ్యాతి

**యునెస్కో తాత్కాలిక జాబితాలో తిరుమల, ఎర్రమట్టి దిబ్బలు**

**ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా కీలక ముందడుగు**

**భారత్ నుంచి మొత్తం ఏడు ప్రదేశాలకు చోటు**

**జాబితాలో డెక్కన్ ట్రాప్స్, మేఘాలయ గుహలు కూడా**

**ఎక్స్ వేదికగా ప్రకటించిన భారత ప్రతినిధి బృందం**





ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రఖ్యాత సహజ సంపదలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కే అవకాశం ఏర్పడింది. కలియుగ వైకుంఠంగా పేరుగాంచిన తిరుమల కొండలు, విశాఖపట్నంలోని ఎర్రమట్టి దిబ్బలు యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. ఇది ప్రపంచ వారసత్వ హెూదాను సాధించే దిశగా ఒక కీలకమైన ముందడుగు.భారత్ నుంచి మొత్తం ఏడు సహజ వారసత్వ ప్రదేశాలను యునెస్కో తన తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి బృందం ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ రెండు ప్రదేశాలు ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందనున్నాయి.ఈ జాబితాలో ఏపీకి చెందిన ప్రదేశాలతో పాటు, మహారాష్ట్రలోని పాంచని-మహాబలేశ్వర్‌లోని డెక్కన్ ట్రాప్స్, కర్ణాటకలోని ఉడుపిలోని సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్, మేఘాలయలోని మేఘాలయన్ ఏజ్ గుహలు ఉన్నాయి. అలాగే, నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్, కేరళలోని వర్కాల క్లిఫ్ కూడా ఈ జాబితాలో స్థానం దక్కించుకున్నాయని అధికారులు తెలిపారు. తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకోవడం ప్రపంచ వారసత్వ హెూదా పొందడంలో మొదటి, కీలకమైన అడుగుగా భావిస్తారు.

**రమాయణం**

# అమ్మగార్లు.. అయ్యగార్లు



మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే డబ్బై ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. "ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!" అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. "మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!" అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. "పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది".. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. "ఏం గావాలె అయ్యగారూ!" అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. "ఇటు దిక్కు రావొద్దు.. మడి!" అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. "గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!" అని అమ్మను అడిగాను. "నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!" అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. "తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు" అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెల్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. "పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టినోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు" అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! "మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!" అనేవాడు. "ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు" అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారు. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!

# పెట్రోల్, డీజిల్‌కు రూల్స్ ఏం ఉండవ్

**ఇంధన భద్రతలో భారత్‌కు ఢోకా లేదు**

**ఎనిమిది వారాలకు సరిపడా ముడి చమురు, పెట్రోలియం నిల్వలు సిద్ధం**

**గ్యాస్‌కు ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి**

**ఖతార్‌పై ఆధారాన్ని తగ్గిస్తూ బహుళ దేశాల నుంచి సరఫరా వ్యూహం**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ దేశంలో ఇంధన కొరత వస్తుందేమో అన్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో చెక్ పెట్టింది. పెట్రోల్, డీజిల్‌పై ఎలాంటి రోజూ వారి నిబంధనలు విధించే ఆలోచన ఏమీ లేదని, దేశానికి అవసరమైనంత నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. సరఫరా వ్యవస్థ బలంగా ఉండటంతో సాధారణ ప్రజలు, పరిశ్రమలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపాయి.దేశ ఇంధన భద్రతపై సమీక్షను రోజూ నిర్వహిస్తున్నామని, నిల్వలు రోజూ భర్తీ అవుతున్నాయని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా ఎల్పీజీ, ఎల్ఎన్జీ, ముడి చమురు సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. గ్యాస్ సరఫరాను ప్రాధాన్య రంగాలకు నిరంతరంగా అందించేందుకు గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) అవసరమైతే ఫోర్స్ మేజ్యూర్ ప్రకటించనున్నట్లు సమాచారం. అనుకోని పరిస్థితుల్లో ఒప్పంద బాధ్యతల నుంచి రక్షణ పొందేందుకు ఈ నిబంధన ఉపయోగపడుతుంది.భారత్‌కు ఎల్ఎన్జీ సరఫరాలో కీలక భాగస్వామిగా ఉన్న ఖతార్ ఎనర్జీ కూడా ఇదే విధానాన్ని అనుసరించింది. ప్రపంచ ఎల్ఎన్జీ అవసరాల్లో సుమారు 20 శాతం సరఫరా చేసే ఖతార్, భారత్‌కు ప్రతిరోజూ సుమారు 60 ఎంఎంఎస్సీఎండీ గ్యాస్ అందిస్తోంది. మొత్తం 195 ఎంఎంఎస్సీఎండీ దిగుమతుల్లో ఇది ఒక భాగమే కావడంతో, ఇతర మార్కెట్ల నుంచి కూడా కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

**ఆస్ట్రేలియా, కెనడా నుంచి ఆఫర్స్**

ప్రత్యామ్నాయ వనరులపై భారత్ దృష్టి సారించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా దేశాలు భారత్‌కు గ్యాస్ సరఫరా చేయడానికి ముందుకు వచ్చాయి. అలాగే కొత్త ఒప్పందాల ద్వారా యూఏఈ, అమెరికా నుంచి కూడా ఇంధన వనరులు సమీకరిస్తోంది. దీంతో ఒకే దేశంపై ఆధారపడే పరిస్థితి తగ్గుతోంది. ముడి చమురు, ఎల్పీజీ కొనుగోళ్ల కోసం భారత్ ప్రముఖ ఉత్పత్తిదారులు, వ్యాపార సంస్థలతో చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ స్థాయిలో సమన్వయం కోసం వివిధ సంస్థలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి. చమురు రవాణా నౌకలకు బీమా సౌకర్యాల కోసం అమెరికాతో ప్రత్యేక చర్చలు జరుగుతు న్నాయి.ప్రస్తుతం దేశానికి తక్షణ అవసరాల కోసం సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. వ్యూహాత్మక నిల్వలతో కలిపి సుమారు ఎనిమిది వారాల పాటు సరిపడే ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని అంచనా. విడిగా చూస్తే సుమారు 25 రోజుల ముడి చమురు, మరో 25 రోజుల పెట్రోల్, డీజిల్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. సరఫరా అంతరాయం వచ్చినా తాత్కాలికంగా ఇబ్బంది లేకుండా వ్యవస్థను నడిపించగలమని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**పెద్దగా ప్రభావం ఉండదని అంచనా**

ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో సముద్ర మార్గాలపై కూడా భారత్ జాగ్రత్తలు తీసుకుంటోంది.




దేశానికి వచ్చే ముడి చమూరులో కేవలం 40 శాతం మాత్రమే హుర్ముజ్ మార్గం గుండా వస్తోంది. మిగిలిన 60 శాతం ఇతర మార్గాల ద్వారా రావడం వల్ల ప్రమాదం తక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కఠినంగా మారినా సరఫరాపై పెద్దగా ప్రభావం ఉండదని అంచనా. అదే సమయంలో పాత ఒప్పందాల ప్రకారం రష్యా నుంచి కూడా ముడి చమురు దిగుమతులు కొనసాగుతున్నాయి. వివిధ దేశాల నుంచి సరఫరాలు విభిన్నంగా ఉండటంతో ధరల ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

**మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు**

ఇంధన పరిస్థితిపై ప్రభుత్వం రోజుకు రెండుసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పులు, సరఫరా గొలుసులో ఆటంకాలు, రవాణా సమస్యలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. అవసరమైతే తక్షణ నిర్ణయాలు తీసుకునేలా ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సమాచారం. మొత్తం మీద దేశ ఇంధన భద్రత విషయంలో భారత్ "కంఫర్టబుల్ పొజిషన్"లో ఉందని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ రేషన్, గ్యాస్ కొరత, ధరల షాక్‌లాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం లేదని చెబుతున్నాయి. ప్రత్యామ్నాయ మార్కెట్లు, వ్యూహాత్మక నిల్వలు, బహుళ దేశాల నుంచి సరఫరాలు ఈ మూడు అంశాలు కలిసి భారత్‌కు భరోసా కల్పిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ప్రజలకు ఇంధన సరఫరా అంతరాయం లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అధికారులు మరోసారి స్పష్టం చేశారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాధారణ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

# లే ఆఫ్... 300 మంది ఉద్యోగులను సాగనంపుతున్న ఫ్లిప్ కార్ట్!

**ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్ కార్ట్ లో ఉద్యోగాల కోత**

**సుమారు 250 నుంచి 300 మంది ఉద్యోగులను తొలగించిన యాజమాన్యం**

**వార్షిక పనితీరు సమీక్షలో భాగంగానే ఈ చర్యలని వెల్లడి**

**ఇది సాధారణ ప్రక్రియేనని ఫ్లిప్ కార్ట్ ప్రకటన**



ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్ కార్ట్ తన ఉద్యోగులకు షాకిచ్చింది. వార్షిక పనితీరు సమీక్ష పేరుతో సుమారు 250 నుంచి 300 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించింది. వివిధ విభాగాలు, స్థాయిల్లో ఈ కోతలు ఉన్నట్లు తెలుస్తోంది. తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సిద్ధమవుతున్న తరుణంలో కంపెనీ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ తొలగింపులపై ఫ్లిప్ కార్ట్ యాజమాన్యం స్పందించింది. ఉద్యోగుల పనితీరును తాము క్రమం తప్పకుండా సమీక్షిస్తామని, నిర్దేశిత అంచనాలను అందుకోలేకపోయిన కొద్ది శాతం మంది ఉద్యోగులు సంస్థ నుంచి వైదొలగుతున్నారని ఒక ప్రకటనలో తెలిపింది. ఇది ఏటా జరిగే సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది. ఎంత మందిని తొలగించారన్న విషయాన్ని మాత్రం ఫ్లిప్ కార్డ్ వెల్లడించలేదు.అయితే, ఓ వైపు ఐపీఓ కోసం సన్నాహాలు చేస్తూ, మరోవైపు సీనియర్ స్థాయి ఉద్యోగాల్లో నియామకాలు జరుపుతున్న ఫ్లిప్ కార్ట్.. అదే సమయంలో ఉద్యోగులను తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఫ్లిప్ కార్ట్ 2024లో కూడా దాదాపు 1000 మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. వాల్ మార్ట్ మద్దతు కల్గిన ఫ్లిప్ కార్ట్ త్వరలో ఐపీఓకు వచ్చేందుకు సన్నహాలు చేస్తోంది. ఇందులో భాగంగా సింగపూర్ లో ఉన్న తన ప్రధాన కార్యాలయాన్ని భారత్ కు తరలించింది. భారత నియంత్రణ సంస్థల అవసరాలకు అనుగుణంగా తన హోల్డింగ్ నిర్మాణంలో మార్పులు చేసింది.

# వార్ ఎఫెక్ట్ : భారీగా పెరిగిన వంట గ్యాస్ ధరలు

**భారీగా పెరిగిన వంట గ్యాస్ ధరలు**

**గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.60 పెంపు**




దేశంలో వంట గ్యాస్ సిలిండర్ ధరలు భారీగా పెరిగాయి. గృహ వినియోగ సిలిండర్ ధరను చమురు సంస్థలు రూ.60 రూపాయల మేర పెంచాయి. . గృహ అవసరాల కోసం వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.60 పెంచింది. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు సహా వాణిజ్య అవసరాల కోసం వాడే కమర్షియల్ 19 కిలోల సిలిండర్ ధరను రూ.114.5 పెంచింది. ఈ పెంచిన ధరలు శనివారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**నగరాల వారీగా కొత్త ధరలు**

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) వెబ్‌సైట్ ప్రకారం దిల్లీలో సబ్సిడీ లేని 14.2 కిలోల గృహ ఎల్పీజీ సిలిండర్ ధర ఇప్పుడు రూ.913కి పెరిగింది. ముందుగా ఇది రూ.853గా ఉండేది. ఒక ఏడాదిలోనే గృహ గ్యాస్ ధరలు పెరగడం ఇది రెండోసారి. చివరిసారిగా గత ఏడాది ఏప్రిల్‌లో రూ.50 పెంచించారు. హైదరాబాద్‌లో ఈ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.965కు చేరింది. అలాగే ముంబయి, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్‌లో ఎల్పీజీ ధరలు వరుసగా రూ.రూ.912.50, రూ.939, రూ.928.50, రూ ఐఓసీ తెలిపింది. స్థానిక పన్నులు (వ్యాట్ లేదా సేల్స్ ట్యాక్స్) ఆధారంగా రాష్ట్రాల మధ్య ధరల్లో తేడాలు ఉంటాయి. అయితే ఈ కొత్త ధరలను పొరుగు దేశాలతో పోలిస్తే భారత్‌లో వంట గ్యాస్ ధర అత్యల్పంగా ఉందని అధికారులు అంటున్నారు.

**వాణిజ్య సిలిండర్ ధరల్లో భారీ పెంపు**

హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య సంస్థలు ఉపయోగించే 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.114.5 పెంచారు. దీంతో దిల్లీలో ఈ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,883కి చేరింది. అదే ముంబయిలో కోల్‌కతా, చెన్నైలో వాణిజ్య సిలిండర్ ధరలు వసరుసగా రూ.1835, రూ.1990 రూ.2043 చేరుకున్నాయి చేరింది. మార్చి 1న ఇప్పటికే రూ.28 పెంచింది. ఇది రెండోసారి. ఈ ఏడాది ఇప్పటివరకు కమర్షియల్ ఎల్పీజీ ధరలు మొత్తం రూ.302.50 మేర పెరిగాయి.

**ఉజ్వల పథకం లబ్ధిదారులకు సబ్సిడీ కొనసాగింపు**

ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు మాత్రం సబ్సిడీ కొనసాగుతుంది. ఈ పథకం కింద ఉన్న 10 కోట్లకు పైగా కుటుంబాలకు సంవత్సరానికి గరిష్ఠంగా 12 సిలిండర్ల వరకు ఒక్కో సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ అందుతుంది.పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు ఇంకా కొనసాతున్నాయి. దాడులు, ప్రతిదాడులతో యుద్ధం రెండో వారానికి చేరింది. దాడుల నేపథ్యంలోనే ఇప్పటికే ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీంతో ప్రపంచ ఇంధనంపై భారీగా ప్రభావం పడింది. ఇంధన లభ్యతపై ఆందోళనలు వ్యక్తం కావడంతో ఇటీవల కేంద్ర పెట్రోలియం శాఖమంత్రి హర్దీప్‌సింగ్ పురి స్పందించారు. పౌరలకు అందుబాటు ధరలో ఇంధనం లభ్యమయ్యేలా చూడటం తమ ప్రాధాన్యత అని అన్నారు. దేశంలో ఎలాంటి ఇంధ కొరతా లేదని పేర్కొన్నారు. దీనిపై అందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.మరోవైపు దేశంలో పెట్రోల్, డీజిల్ కొరతపై చక్కర్లు కొడుతున్న ప్రచారాలను ఐఓసీ కూడా తోసిపుచ్చింది. ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్పీజీ విషయంలో భారత్ సౌకర్యవంతమైన స్థితిలోనే ఉందని శుక్రవారం ప్రభుత్వ వర్గాలు భరోసా ఇచ్చాయి. హర్మూజ్ అంతరాయాల వేళ వేర్వేరు సోర్సుల నుంచి దేశానికి భారీ స్థాయిలో ఇంధనం లభ్యమవుతోందని పేర్కొన్నాయి.

# యుద్ధ భయాలతో మార్కెట్లు విలవిల కుప్పకూలిన సూచీలు!

**అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధ ప్రభావంతో స్టాక్ మార్కెట్ల భారీ పతనం**

**ఒక్కరోజే 1097 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**బహ్రెయిన్ ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ దాడితో పెరిగిన చమురు ధరలు**

**భారీగా పడిపోయిన బ్యాంకింగ్, రియల్టీ రంగ షేర్లు**

**డాలర్‌తో పోలిస్తే 91.84 స్థాయికి పడిపోయిన రూపాయి విలువ**

అంతర్జాతీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి.



అమెరికా-ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఏడో రోజుకు చేరుకోవడంతో శుక్రవారం దలాల్ స్ట్రీట్ విలవిల్లాడింది. ఆయిల్ ధరలు భగ్గుమనడం, యుద్ధ భయాలతో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు దిగడంతో సూచీలు కుప్పకూలాయి.మార్కెట్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1,097 పాయింట్లు కోల్పోయి 78,918 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315 పాయింట్లు నష్టపోయి 24,450 వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. నిఫ్టీ బ్యాంక్ సూచీ 2.15 శాతం పతనమై 57,783 వద్దకు చేరింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలను చవిచూశాయి.సెక్టార్ల వారీగా పరిశీలిస్తే.. ప్రైవేట్ బ్యాంక్, పిఎస్‌యు బ్యాంక్, రియల్టీ రంగాలు టాప్ లూజర్స్ గా నిలిచాయి. అయితే ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. మరోవైపు యుద్ధ వాతావరణం కారణంగా డిఫెన్స్ షేర్లలో మాత్రం జోరు కనిపించింది. ఎన్ఎస్ఈలో పలు డిఫెన్స్ కంపెనీల షేర్లు, ప్రభుత్వ రంగ సంస్థల షేర్లు 9 శాతం వరకు లాభపడటం గమనార్హం.ఇరాన్ క్షిపణి దాడులతో బహ్రెయిన్‌లోని ఆయిల్ రిఫైనరీ దెబ్బతినడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 86 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతుండగా, అమెరికన్ క్రూడ్ 81 డాలర్లు దాటింది. దీంతో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.09 శాతం తగ్గి 91.84 వద్ద ముగిసింది. మార్కెట్లో అనిశ్చితి పెరగడంతో ఇండియా విక్స్ (వీఐఎక్స్) సూచీ 11 శాతం పెరిగింది. ప్రస్తుతం నిఫ్టీకి 24,500 పాయింట్లు కీలక మద్దతుగా నిలుస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ఒరాకిల్ లేఆఫ్స్

## 30,000 మంది ఉద్యోగుల తొలగింపు వెనుక ఏఐ పెట్టుబడులు, ఆర్థిక సవాళ్లు వెల్లడి!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వచ్చాక, కంపెనీలు తమ ఉద్యోగుల పట్ల వ్యవహరించే తీరే పూర్తిగా మారిపోయింది. చాలా సంస్థలు లాభాలనే లక్ష్యంగా పెట్టుకుని ఉద్యోగుల కొలువులపై వేటు వేస్తున్నాయి. గత రెండేళ్లుగా ఐటీ కంపెనీల్లో భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించడం మనం చూస్తూనే ఉన్నాం. మన దేశంలోనే టీసీఎస్ తన ఉద్యోగుల్లో 2 శాతం మందిని తీసేసింది. ఇప్పుడు ఇదే బాటలో, అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం ఒరాకిల్ ఏకంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయిం చుకున్నట్లు వచ్చిన వార్త టెక్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. ఈ నెలలోనే ఒరాకిల్ లేఆఫ్స్ ప్రకటన వెలువడవచ్చని, కంపెనీలో భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమైనట్లు బ్లూమ్‌బెర్గ్ నివేదిక పేర్కొంది. ఈ తొలగింపుల వల్ల ఒరాకిల్‌లోని పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ప్రభావం పడనుంది. వీరి స్థానంలో ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవాలని ఒరాకిల్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఈ కంపెనీ తమ క్లౌడ్ విభాగంలో కొత్త నియామకాలను నిలిపివేసింది. ప్రస్తుతం ఏఐ రంగంపైనే పూర్తి దృష్టి సారించింది. దీనికోసం ఓపెన్‌ఏఐతో ఒక ఒప్పందం కూడా కుదుర్చుకుంది. అయితే, ఈ నిర్ణయం కంపెనీపై భారీ ఆర్థిక భారాన్ని మోపింది. సాంప్రదాయ డేటాబేస్ సాఫ్ట్‌వేర్ కంపెనీగా ఉన్న ఒరాకిల్‌ను.. అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి భారీ క్లౌడ్ కంపెనీగా మార్చాలని సీఈఓ లారీ ఎల్లిసన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం ఏఐ విభాగం, దానికి సంబంధించిన డేటా సెంటర్లు, టెక్నాలజీలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఒరాకిల్ తన ఏఐ లక్ష్యాలను చేరుకోవడానికి 30 లక్షల జీపీయూలు అవసరమని, దీనికి 156 బిలియన్ డాలర్ల మూలధనం కావాలని అంచనా. ఇటీవలే కంపెనీ 58 బిలియన్ డాలర్ల అప్పు తీసుకుంది. అయితే, ఒరాకిల్ ఏఐపైనే పూర్తి దృష్టి పెట్టడంతో, ఆర్థిక సంస్థలు రుణాలు ఇచ్చేందుకు వెనుకాడుతున్నాయి. ఇప్పటికే అప్పులు పెరిగిపోవడం, ప్రస్తుత పెట్టుబడులపై 2030 వరకు లాభాలు రావనే అంచనాలతో చాలా సంస్థలు రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో,




ఉద్యోగులను తొలగించడం ద్వారా వారి జీతాల రూపంలో ఆదా అయ్యే డబ్బును ఏఐ లక్ష్యాల కోసం ఉపయోగించుకోవాలని ఒరాకిల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అందుకే సుమారు 30,000 మందిని తొలగించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కాగా, అమెజాన్ ఈ ఏడాది జనవరిలో 16,000 మందిని, అంతకుముందు అక్టోబర్‌లో 14,000 మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. గతేడాది మైక్రోసాఫ్ట్ కూడా 15,000 మంది ఉద్యోగులను తొలగించింది. సేల్స్‌ఫోర్స్, బ్లాక్ ఇంక్ వంటి అనేక ఇతర అగ్రశ్రేణి కంపెనీలు సైతం ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నాయి.

# భారత్‌కు అమెరికా బంపర్ ఆఫర్

**రష్యన్ ఆయిల్ కొనొచ్చంటూ గ్రీన్ సిగ్నల్!**

**పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం**

**రష్యా చమురు కొనుగోలుకు భారత్‌కు 30 రోజుల అనుమతి**

**అంతర్జాతీయ మార్కెట్లో ధరల స్థిరీకరణే లక్ష్యమన్న అమెరికా**

**సముద్రంలో నిలిచిపోయిన చమురును శుద్ధి చేయనున్న భారత్**

**భారత తీరానికి సమీపంలో 15 మిలియన్ బ్యారెళ్ల చమురు**

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన విదేశాంగ విధానంలో కీలక మార్పు చేసింది. తన మిత్రదేశమైన భారత్, సముద్ర మార్గంలో చిక్కుకుపోయిన రష్యన్ ముడి చమురును కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగకుండా నిరోధించేందుకే ఈ తాత్కాలిక వెసులుబాటు కల్పించినట్లు వాషింగ్టన్ ప్రకటించింది.ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణంతో 'హోర్ముజ్ జలసంధి' మార్గంలో రవాణాకు అంతరాయం కలిగే ప్రమాదం ఏర్పడింది. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు కొరతకు దారితీసి, ధరలు పెరిగేందుకు కారణమవుతోంది. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌ను స్థిరీకరించాలని అమెరికా భావిస్తోంది. "ఇప్పటికే సముద్రంలో ఉన్న ఆ చమురును మా మిత్రదేశమైన భారత్ తీసుకోమని చెప్పాం. దీనివల్ల ప్రపంచంలోని ఇతర రిఫైనరీలపై ఒత్తిడి తగ్గుతుంది" అని అమెరికా ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్ స్పష్టం చేశారు.అయితే, ఈ మినహాయింపు కేవలం 30 రోజులకు మాత్రమే పరిమితమని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తెలిపారు. మార్చి 5వ తేదీకి ముందు నౌకల్లోకి ఎక్కించి, సముద్రంలో నిలిచిపోయిన రష్యన్ చమురుకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీనివల్ల రష్యాకు కొత్తగా ఆర్థిక ప్రయోజనం చేకూరదని, కేవలం మార్కెట్లో సరఫరా పెంచడమే తమ లక్ష్యమని అమెరికా పేర్కొంది. గతంలో రష్యా నుంచి చమురు దిగుమతులపై ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో, ప్రస్తుత నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు పెద్ద ఊరటనిస్తోంది. ప్రస్తుతం సుమారు 15 మిలియన్ బ్యారెళ్ల రష్యన్ ముడి చమురు భారత తీరానికి సమీపంలో నౌకల్లో సిద్ధంగా ఉంది. వారం రోజుల్లోనే ఇవి భారత రేవులకు చేరే అవకాశం ఉంది. ముడి చమురు ధరల పెరుగుదలతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే ఆందోళనల నడుమ, ఈ దిగుమతులు సామాన్యులకు కొంత ఉపశమనం కలిగించనున్నాయి.



## సుశాంత్‌తో ప్రేమ .. గాసిప్స్‌పై మీనాక్షి చౌదరి క్లారిటీ

ప్రస్తుతం టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల విజయ్-రష్మిక వివాహం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అలాగే మార్చి 6న అల్లు శిరీష్-- నయనిక రెడ్డి వివాహం జరగనుండటంతో సినీ వర్గాల్లో పెళ్లి వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇదే సమయంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి వ్యక్తిగత జీవితంపై కూడా కొన్ని గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వాటిపై స్పష్టత ఇచ్చారు. తన అందం, నటనతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించిన హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. ఆసక్తికర విషయం ఏమిటంటే, చాలా మంది నటీనటులు డాక్టర్ అవ్వాలని అనుకుని సినిమాల్లోకి వచ్చామని చెబుతుంటారు. కానీ మీనాక్షి మాత్రం నిజంగానే డెంటిస్ట్ చదివి తర్వాత సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ సినిమాల్లో ముందుకు సాగారు. 2019లో వచ్చిన హిందీ సినిమా అప్‌స్టార్ట్స్ ద్వారా మొదటిసారి తెరపై కనిపించిన మీనాక్షి, 2021లో వచ్చిన ఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత ఖిలాడీ, హిట్: ది సెకండ్ కేసు, గుంటూరు కారం వంటి చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన లక్కీ భాస్కర్ ఆమెకు మంచి పేరు తెచ్చింది. అలాగే వెకంటేష్‌తో కలిసి చేసిన సంక్రాంతికి వస్తున్నాం కూడా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు మాత్రమే కాకుండా తమిళంలో కూడా ఆమె పలు సినిమాల్లో నటించారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్న 'వృషకర్మ' సినిమాలో మీనాక్షి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆమె లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా, కొంతకాలంగా మీనాక్షి చౌదరి ఒక తెలుగు హీరోతో రిలేషన్‌లో ఉన్నారని గాసిప్స్ వినిపించాయి. ఆ హీరో మరెవరో కాదు సుశాంత్. వీరిద్దరూ కలిసి నటించినఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమా షూటింగ్ సమయంలో స్నేహం పెరిగి అది ప్రేమగా మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా స్పందించిన మీనాక్షి, వాటిని పూర్తిగా ఖండించారు. సుశాంత్‌తో తనకు ప్రేమ సంబంధం లేదని, అతను మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై గాసిప్స్ ఎక్కువ కావడంతో మీనాక్షి టీమ్ కూడా స్పందించి ఇద్దరూ కేవలం ఫ్రెండ్స్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది.

## కృతి సనన్‌ను తక్కువ చేసి అవమానించాలన్నది నా ఉద్దేశం కాదు

బాలీవుడ్ నటీమణులు యామీ గౌతమ్, కృతిసనన్ మధ్య సోషల్ మీడియా వేదికగా వివాదం తలెత్తింది. ఇటీవల జరిగిన 'జీ సినీ అవార్డ్స్' వేడుకలో కృతి సనన్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు.అయితే, ఈ గెలుపును విమర్శిస్తూ రూపొందించిన ఒక వీడియోకు యామీ గౌతమ్ 'లైక్' చేయడంతో నెట్టింట పెద్ద దుమారమే రేపింది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో, యామీ తాజాగా సోషల్ మీడియా ద్వారా క్లారిటీ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. 'తేరే ఇష్క్ మే' చిత్రంలో నటనకు గానూ కృతి సనన్‌కు ఉత్తమ నటి అవార్డు దక్కిన విషయం తెలిసిందే. అయితే, 'హక్' సినిమాతో ఆ అవార్డుకు యామీ గౌతమ్ మరింత అర్హురాలని నెటిజన్లలో ఒక వర్గం అభిప్రాయపడింది. ఈ క్రమంలో, కృతి సనన్ గెలుపును తక్కువ చేస్తూ.. గతంలో యామీ ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ క్లిప్‌ను జోడిస్తూ ఇన్స్టాగ్రామ్‌లో ఒక వీడియో వైరల్ అయ్యింది. ఆ వీడియోలో యామీ, "అవార్డు వస్తేనే మంచి నటి అని కాదు.. నేను ఎవరి గుర్తింపును కోరుకోవడం లేదు" అని అన్న మాటలు ఉన్నాయి. ఈ వీడియోను యామీ లైక్ చేయడంతో, ఆమె కృతిపై అసూయతో ఉందని కొందరు విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో.. ఈ వివాదంపై స్పందిస్తూ, అది పొరపాటున జరిగిన 'లైక్' అని యామీ స్పష్టం చేశారు. "నేను ఒక నటిని కించపరిచేలా ఉన్న వీడియోను లైక్ చేశానని నా దృష్టికి వచ్చింది. ప్రతిరోజూ మమ్మల్ని వందలాది పోస్టుల్లో ట్యాగ్ చేస్తూ ఉంటారు. అవార్డు ఫంక్షన్ హడావిడిలో పొరపాటున ఆ వీడియోపై క్లిక్ అయి ఉండవచ్చు తప్ప, కావాలని చేసింది మాత్రం కాదు. నా కెరీర్‌లో ఎప్పుడూ ఇలాంటి చీప్ పీఆర్ టెక్నిక్స్ ఉపయోగించలేదు. నాకు అసలు పీఆర్ టీమే లేదు. అవార్డుల మీద నా అభిప్రాయం ఏంటో ఎప్పుడో చెప్పేశాను. నేను కేవలం నా పని మీద మాత్రమే దృష్టి పెడతాను. సోషల్ మీడియాలో వచ్చే గాసిప్స్ నమ్మవద్దు, నాకు అంతకంటే మంచి పేరు ఉందని ఆశిస్తున్నాను" అని ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు.



## నాగబంధం ఫస్ట్ సింగిల్.. అద్భుతమైన పోస్టర్ రిలీజ్ చేసిన మేకర్స్

మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియన్ మూవీ నాగబంధం అద్భుతమైన కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తోంది. అభిషేక్ నామా దర్శకత్వంలో ఔఎఐ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్



ఇచ్చారు. మార్చి 15న ఉదయం 11:11 గంటలకు నాగబంధం ఫస్ట్ సింగిల్ "నమో రే" రిలీజ్ కానుంది. ఈ పాట నారాయణుడికి నివాళిగా ఆధ్యాత్మికత ప్రజెంట్ చేయబోతోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న నాగబంధంలో "నమో రే" సాంగ్ ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది. ఈ పాటలో ఏకంగా 1,000 మంది డ్యాన్సర్లు పాల్గొంటూ, భారతీయ నృత్య కళల వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబించే అద్భుతమైన విజువల్ స్పెక్టాకిల్‌గా రూపొందించారు. ఇక రిలీజ్ చేసిన పోస్టర్‌లో నభా నటేష్, ఐశ్వర్య మీనన్‌లు సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తూ అద్భుతంగా ఆకట్టుకుంటున్నారు. ఈ పాటను అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని ప్రతిబింబించే భారీ సెట్లో చిత్రీకరించడం ద్వారా విజువల్‌గా మరింత వైభవాన్ని అందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. దీంతో సినిమాపై అంచనాలు పెరిగిపోగా.. వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది.

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న మరో కుర్ర హీరో.. త్వరలో ఆమెతో నిశ్చితార్థం?

టాలీవుడ్‌లో ఈ ఏడాది పెళ్లి సందడి కొనసాగుతోంది. వరుసగా యువ హీరోలు వివాహ బంధంలోకి అడుగుపెడుతుండగా, ఇప్పుడు మరో కుర్ర హీరో పెళ్లి వార్తలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ కుమారుడు, టాలీవుడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు సమాచారం. కొన్ని నెలలుగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వివాహంపై వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ వార్తలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన లాయర్ కుటుంబానికి చెందిన యువతి కావ్య రెడ్డితో ఆయన పెళ్లి జరగబోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కావ్య రెడ్డి తాతగారు జడ్జిగా పనిచేసి రిటైర్ అయ్యారని, ఆమె తండ్రి ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక ఈ వారంలోనే వీరిద్దరి నిశ్చితార్థం జరగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే బెల్లంకొండ కుటుంబం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినీ కెరీర్ విషయానికి వస్తే, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 2014లో వచ్చిన అల్లుడు శీను సినిమాతో హీరోగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత వరుసగా పలు సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది విడుదలైన భైరవం, కిష్కింధపురి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన స్థాయి విజయాలు దక్కలేదు. ప్రస్తుతం ఆయన టైసన్ నాయుడు, హైందవ వంటి సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలు త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఒకవైపు కెరీర్‌లో కొత్త సినిమాలతో ముందుకు సాగుతూనే, మరోవైపు వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పెళ్లి వార్తలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో అన్నదానిపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.



## గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైన 'కార్మేని సెల్వం'



రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మిస్తున్న ఈ మూవీలో విలక్షణ నటులు సముద్రఖని, గౌతమ్ వాసుదేవ్ మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు తెలిపారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రానికి అధికారిక థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ పార్ట్‌నర్‌గా చేరింది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని రేకెత్తించింది. త్వరలో విడుదల కాబోయే టీజర్‌తో ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీని పెంచాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఈ చిత్రం నిజాయితీతో జీవించే ఒక సాధారణ కార్ డ్రైవర్ సెల్వం జీవితం చుట్టూ తిరుగుతుంది. ఆధునిక సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్ల మధ్య అతడు ఎలా ముందుకు సాగుతాడు అనే అంశాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.